నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 3-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:209 పేజీలు:6 వెల: రూ.1/-

కేటీఆర్ రోడ్ షోలు విజయవంతం చేస్తాం : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, మే2: మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌నిర్వహించే రోడ్ షోలను విజయవంతం చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో ఈ నెల 4 న జరిగే రోడ్ షో స్థలాన్ని మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు లభిస్తుందన్నారు. కేటీఆర్ రోడ్ షోకు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని మల్లారెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.

చురక

ఎన్నికల సుడి గాలిలో
ఎంత దుమ్మో దాంట్లో
చేయకుంటే ఫిల్టరింక
చేరుతుంది ప్రతి కంట్లో.

అవినీతి నేర చరిత
అభ్యర్థులే కాలుష్యం
నిరోధించే ప్రజాతీర్పే
నేడు ఎంతో ఆవశ్యం

-వేల్పుల నారాయణ

400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోన్న బీజేపీ- రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే2:బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లోక్?సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్?లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై మండిపడ్డారు. దిల్లీ సుల్తాన్‌లు తెలంగాణపై దాడి చేయాలనుకుంటున్నారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే అజెండాతోనే 2021లో జనాభాను లెక్కించలేదని సీఎం దుయ్యబట్టారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని ఆయన దుయ్యబట్టారు. రైతుల పోడు భూముల సమస్యలపై కేసీఆర్ దృష్టి పెట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఇక్కడి ప్రాంతంలో విద్యాభివృద్ధికి బీజేపీ ఎటువంటి కృషి చేయలేదన్నారు. కేంద్ర మంత్రివర్గంలో గోండులకు బీజేపీ స్థానం ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గోండులు, లంబాడ హక్కులను కాపాడలేదని మండిపడ్డారు. ఇంతవరకు ఆదిలాబాద్ లోక్‌సభ టికెట్‌ను మహిళలకు ఏ పార్టీ ఇవ్వలేదని, తొలిసారిగా ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను మహిళలకు కేటాయించినట్లు సీఎం రేవంత్ పేర్కొన్నారు.

సామాన్య ప్రభుత్వ ఉద్యోగికి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆత్రం సుగుణ పోరాడుతోందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ అంటేనే తనకు ప్రత్యేకమైన అభిమానమని, తాను సీఎం కాగానే తొలి సంతకం ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం అభివృద్ధి కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో సీసీఐ మూతపడినా, కేసీఆర్, మోదీ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. పదేళ్లు మోదీ, కేసీఆర్ అధికారంలో ఉన్నా ఆదిలాబాద్‌కు ఏం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశామని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేయాలని ఆరెస్సెస్ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి దేశంలో జనాభా లెక్కలు లెక్కిస్తున్నామని, 2021లో జనాభా లెక్కించాల్సి ఉన్నా బీజేపీ లెక్కించలేదని పేర్కొన్నారు. 2021లో జనాభాను లెక్కించకుండా అమిత్‌షా కుట్ర చేశారని, రిజర్వేషన్లను రద్దు చేయాలనే అజెండాతో 2021లో జనాభాను లెక్కించలేదని సీఎం దుయ్యబట్టారు.

రిజర్వేషన్లు రద్దు చేయాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ కావాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రిజర్వేషన్లు రద్దు చేయాలంటే 50 శాతం రాష్ట్రాలు ఒప్పుకోవాలని, రిజర్వేషన్ల రద్దు కోసమే 8 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాలను పడగొట్టారని మండిపడ్డారు. బీజేపీకి వేసే ప్రతి ఓటు, రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుందని, రాజ్యాంగాన్ని సమూలంగా మార్పు చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగ మార్పుపై మాట్లాడుతున్నా అని తనపై అమిత్‌షా కేసు పెట్టించారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ తనపై 200 కేసులు పెట్టినా భయపడలేదని, కేసులుపెట్టి మెదీ నన్ను బెదిరించ గలరా ఆయన ప్రశ్నించారు. దిల్లీ సుల్తాన్‌లు తెలంగాణపై దాడి చేయాలనుకుంటున్నారని, బీజేపీ ఆటలు సాగవని స్పష్టం చేశారు. బీజేపీ చేసే కుట్రలను అడ్డుకుంటానన్నారు. రాష్ట్రానికి బయ్యారం ఉక్కు కర్మాగారం అడిగితే, మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని, తెలంగాణకు కేంద్రం గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

ఆదిలాబాద్, మే2 రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాస గృహంలో ఇవాళ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు పేర్కొన్నారు..

మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు దీపాదాస్ మున్షీ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, అల్లోల గౌతమ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డిలు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టించిన కేసీఆర్ బస్సు యాత్ర : కేటీఆర్

హైదరాబాద్, మే2:బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఆ రెండు పార్టీలు ఓర్వలేకపోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన పరుష పదజాలం మీద ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు ఇచ్చాం. కానీ చర్యల్లేవు. కేసీఆర్‌ను ఉరితీస్తాం.. లాగుల తొండలు వదులుతాం.. ముడ్డి మీద డ్రాయర్ కూడా ఉండదు.. కేసీఆర్ తల నరకండి.. కేసీఆర్ తల తెగ్గోయండి అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ మాటలు ఎన్నికల సంఘానికి నీతినూకత్తలు, సుభాషితాల్లాగా వినబడుతున్నట్లుంది. ఈ మాటలు ఈసీకి వినిపించవు. అదే కేసీఆర్ నేతన్నలు, రైతుల పక్షాన మాట్లాడితే గట్టిగా ఒక్క మాట మాట్లాడితే.. 48 గంటల నిషేధం విధించారు అని కేటీఆర్ తెలిపారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ పన్నాగం..

బడా భాయ్.. చోటా భాయ్ కన్నుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం పని చేయకపోతే.. తామిచ్చిన 27 ఫిర్యాదులపై స్పందించాలి. రేవంత్ మీద 8, మరో 19 ఫిర్యాదులు మిగతా పార్టీ నాయకులు, వారి వైఖరి మీద ఈసీకి ఫిర్యాదు చేశాం. ఒక్కటంటే ఒక్కదాని మీద కూడా చర్య లేదు. కొండా సురేఖకు మందలింపు తప్ప ఒక్కటంటే ఒక్క చర్య లేదు. వారి ప్రచారాన్ని నిషేధించలేదు. కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించగానే కాంగ్రెస్‌కు, బీజేపీకి దడ పుట్టింది. స్టేట్‌లో ఇంటెలిజెన్స్ రిపోర్ట్, కేంద్రంలో ఐబీ రిపోర్టు ఎప్పటికప్పుడు ఇస్తున్నాయి. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంచి స్పందన వస్తుందని ఆ పార్టీలకు కంటగింపుగా మారింది. 2014లో బడా భాయ్ చేసిన మోసం, 2023లో చోటా భాయ్ చేసిన మోసాన్ని పూసగుచ్చినట్లు ప్రజలకు వివరిస్తుంటే.. తట్టుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇది ఒక పన్నాగం అనేది పార్టీ స్థిరమైన అభిప్రాయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి నిద్ర పట్టడం లేదు..

కేసీఆర్ బస్సు యాత్రకు జనస్పందన చూసిన తర్వాత రెండు పార్టీలకు నిద్ర పట్టడం లేదు. 8 -12 సీట్లు బీఆర్ఎస్‌కు వస్తున్నాయని సర్వేలు వస్తున్నాయి. మొన్నటి దాకా బీఆర్ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలవనివ్వం అని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర తర్వాత వస్తున్న స్పందనను జీర్ణించుకోలేక ఇద్దరు కూడబలుక్కొని కేసీఆర్‌ను ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ఆపడం అప్రజాస్వామిక చర్య. ప్రజలు దీనికి ఓటుతోనే సమాధానం చెప్తారని అనుకుంటున్నాను అని కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ సైన్యాన్ని అడ్డుకోలేరు..

రేవంత్ రెడ్డి ఇంకా చండాలంగా మాట్లాడారు. ఆ మాటలు మేం అనేందుకు సిగ్గు అనిపిస్తుంది. ఆయన మాటలపై ఫిర్యాదు చేస్తే.. గోడకు చెప్పుకున్నట్టే ఉంది కానీ ఈసీ నుంచి స్పందన లేదు. కానీ కేసీఆర్ పట్ల రాకెట్ వేగంతో స్పందించి నిషేధం విధించారు. మీది నిజంగా స్వయం ప్రతిపత్తి సంస్థ అయితే.. ఎందుకు మోదీ మీద చర్యల్లేవు. మోదీకి నోటీసులు ఇవ్వాలంటే ఎందుకు వణికి చచ్చిపోతున్నారు. నడ్డాకు ఎందుకు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి విషయంలో మీ గొంతు ఎందుకు పెగడలం లేదు..? 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించొచ్చు కానీ కేసీఆర్ తయారు చేసిన సైన్యాన్ని మీరు అడ్డుకోలేరు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో ముగ్గురిని అరెస్టు

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు లో హైదరాబాద్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జ్ మన్నే సతీష్ తో పాటు నవీన్ తస్లీమా ను అరెస్ట్ చేశారు. బీజేపీ నేత ప్రేమేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీ పోలీసుల నోటీసుల కంటే ముందే హైదరాబాదులో కేసు నమోదైంది. కాసేపటి క్రితం (గురువారం) ముగ్గురిని అరెస్ట్ చేసి హైదరాబాద్ సీపీఎన్‌కు తరలించారు. కాగా రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో 'డీప్‌ఫేక్' వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. డీప్‌ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఈసీ స్పందించలేదన్నారు. ఎన్నికల వేళ చక్కర్లు కొడుతున్న డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ సక్రమంగా ఉంటే గురువారం విచారణ చేపడతామని తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో భాగంగా సీఎం రేవంత్‌కు సమన్లు జారీ అయ్యాయి. అయితే ఈ నోటీసులపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. "బీజేపీపై పోరాటం చేసే వారికి అమిత్ షా నోటీసులు ఇస్తున్నారు.

సోషల్ మీడియాలో బీజేపీని ప్రశ్నించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రినైనా నాకు, గాంధీ భవన్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇస్తున్నారు'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. న్నికలు వచ్చినప్పుడల్లా మోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపిస్తున్నారని చెప్పారు. కాగా.. ఈ కేసులో మే 1న హాజరుకావాల్సిందిగా ఢిల్లీ పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేస్తున్నారని అమిత్ షా పేరుతో ఓ ఫేక్ వీడియోను కాంగ్రెస్ పార్టీ వైరల్ చేసింది. ఫేక్ వీడియోపై కేంద్ర హోం శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఎఫ్ ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 153/153ం/465/469/171ఉ కింద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి కందం- నేటికీ అందం

తావిగల కాంచనమ్మన..
దేవుడు మన కొసగినట్టి దీవెన యనగన్
కావించె ప్రమాణమ్మును
వీ వీ గిరి రాష్ట్రపతిగ వేవురు మెచ్చన్

(3-5-1969 వీ వీ గిరి రాష్ట్రపతిగా ప్రమాణం చేసినరోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఈ నెల 6కి కోర్టు వాయిదా

న్యూ ఢిల్లీ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బిఆర్ఎస్ ఎంఎల్సి కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఈ నెల 6కి కోర్టు వాయిదా వేసింది. ఇబి, సిబిఐ రెండు కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును ఈ నెల 6న వెలువరిస్తానని జడ్జి కావేరి బవేజా తెలిపారు. మే 7తో కవిత జ్యూడిషియల్ కస్టడీ ముగియనుంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితను ఇడి అధికారులు గత నెల 15న అరెస్ట్ చేసిన సంగతి విదితమే. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆమె, తనకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా రౌస్ అవెన్యూ కోర్టు లో గతంలో పిటిషన్ దాఖలు చేశారు.

కాంగ్రెస్ ఇక్కడ చస్తోందని పాకిస్తాన్ అక్కడ ఏడుస్తోంది

-కాంగ్రెస్ కోసం పాకిస్తానీ నాయకులు ప్రార్థనలు చేస్తున్నారు
-భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని శత్రువులు కోరుకుంటున్నారు
-విరుచుకుపడ్డ ప్రధాని మోడీ

గుజరాత్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కాంగ్రెస్ పార్టీని పాకిస్తాన్ భక్తురాలిగా అభివర్ణించిన ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశ తదుపరి ప్రధానమంత్రిగా యువరాజు(రాహుల్ గాంధీ)ను కూర్చోపెట్టాలని దాయాది దేశం తహతహలాడుతోందని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్‌లోని గత ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన చౌదరి ఫావద్ హుస్సేన్ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో రాహుల్ గాంధీని ప్రశంసిస్తూ పోస్టు పెట్టిన నేపథ్యంలో ప్రధాని మోడీ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఇక్కడ చస్తోందని పాకిస్తాన్ అక్కడ ఏడుస్తోంది. కాంగ్రెస్ కోసం పాకిస్తానీ నాయకులు ప్రార్థనలు చేస్తున్నారు. తదుపరి ప్రధాన మంత్రిగా యువరాజును చూడాలని పాకిస్తాన్ తహతహలాడుతోంది. కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ భక్తురాలని మనందరికీ ఇప్పటికే తెలుసు. కాంగ్రెస్, పాకిస్తాన్ మధ్య ఉన్న భాగస్వామ్యం ఇప్పుడు బట్టబయలైంది. భారత్‌లో బలమైన ప్రభుత్వం కాక బలహీన ప్రభుత్వం ఉండాలని శత్రువులు కోరుకుంటున్నారు అంటూ మోడీ విరుచుకుపడారు. మధ్య గుజరాత్‌లోని ఆనంద్ పట్టణంలో మోడీ ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ ఓటు జిహాద్ పేరిట కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ బంధువు మరియా ఆలం ఇచ్చిన పిలుపుపై మండిపడ్డారు. ఇప్పుడు ఇండియా కూటమి ఓట్ జిహాద్ అని పిలుపునిస్తోందని, ఇప్పటి వరకు లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ అని మాత్రమే విన్నామని మోడీ అన్నారు. మద్రాసాలో చదువుకున్న ఒక విద్యావంతులైన ముస్లిం కుటంబానికి చెందిన వ్యక్తి నుంచి ఈ ఓట్ జిహాద్ పిలుపు వచ్చిందని, జిహాద్ అంటే అర్థమేమిటో మీ అందరికీ తెలుసునని, ఇది ప్రజాస్వామ్యానికే అవమానమని ఆయన అన్నారు. దీన్ని ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు ఖండించలేదని ఆయన చెప్పారు. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన కులాలకు చెందిన రిజర్వేషన్లను ముస్లింలకు అప్పగించడానికి దేశ రాజ్యాంగాన్ని మార్చివేయాలని కాంగ్రెస్ భావిస్తోందని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ ఎంపీఅభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- డిసిసిబి డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల మల్లిబాబు యాదవ్

ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీతో మాత్రమే కురుమ యాదవుల,బడుగు బలహీన వర్గాల సంక్షేమం అభివృద్ధి సాధ్యపడుతుందని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కురుమ యాదవుల సమావేశాలను ఉద్దేశించి డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారంనాడు రఘునాథపాలెం, కూసుమంచి మండలాల యాదవ ప్రముఖుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ. ఇప్పటివరకు బడుగు బలహీన వర్గాలు, దళితులు మైనారిటీలు ముఖ్యంగా కురుమ యాదవుల సంక్షేమం అభివృద్ధి జరిగిందంటే కాంగ్రెస్ పార్టీ పరిపాలన కాలంలో జరిగిందని, ఆ తర్వాత మాయమాటలతో నమ్మించి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వాలు నమ్మకద్రోహం చేశాయని, ప్రజా సంక్షేమ పరిపాలనను తుంగలో తొక్కి కుటుంబ పాలనతో ఇష్టారీతిన వ్యవహరించి ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని, అప్పుల రాష్ట్రంగా మార్చారని ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో ప్రతి రంగం అభివృద్ధి చెందిందని, కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో జీవితకాలం ప్రజలు మరిచిపోలేని పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, దానిలో భాగంగా కురుమ యాదవులని గుర్తించి, ఫెడరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్సీడీసీ ద్వారా మన ఖమ్మం జిల్లాకు కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, గొర్రెలకు మరియు గొర్రెల కాపరులకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు.

వేసవి నిప్పులు కురిపిస్తోంది - వడదెబ్బతో జర జాగ్రత్త !

సమ్మర్ హీటెక్కిస్తున్నది. వేసవి ఉష్ణోగ్రతలు జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. భూమి నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ఉదయం 8 గంటలు దాటితే వేసవి తాపం, ఎండ, ఉక్కపోత వెంటాడుతున్నాయి. నేడు పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటి పాదరసం ఎగబాకుతోంది. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరికలు సహితం జారీ చేసే అసాధారణ స్థాయి వరకు చేరింది. ఒక వైపు భానుడి భగభగలు, మరో వైపు ఉక్కపోతలతో జనం నీడలను వెతుక్కుంటూ పరుగిడుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకుంటూనే జీవనోపాధి పోరాటాలు కొనసాగిస్తున్నారు. మారుతున్న వాతావరణ ప్రతికూలతల ఫలితంగా వడగాలులు, సూర్య ప్రతాపాలు తీవ్ర ప్రజారోగ్య సమస్యలకు ఊతం ఇస్తున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకుంటూ మన మన పనులను చేసుకోవడానికి కొన్ని జాగ్రత్తలు, జీవనశైలి మార్పులు చేసుకోవడమే మన ముందున్న ఏకైక మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. మే మాసంలో ఎండల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉంది కాబట్టి పలు చిట్కాలు తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించాలి.

ఎండలకు వీలైనంత దూరంగా ఉందాం:

శరీరంపై నేరుగా మధ్యాహ్న వేళ సూర్య కాంతి పడకుండా ఉండేలా గొడుగులు, చెట్టు నీడలు, కృత్రిమ పైకప్పులు, బైకులపై పయణించే వారు చర్మాన్ని బట్టలతో కప్పుకోవడం, ముఖాన్ని కాటన్ చేతిరుమాలు లేదా టవల్‌తో కప్పుకోవడం, తలపై టోపి పెట్టుకోవడం, చల్లని ప్రదేశాల్లో ఉండే ప్రయత్నాలు, గాలి ప్రవహించే గదుల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుందాం. శరీరంపై నేరుగా అతినీలలోహిత కిరణాలు కలిగిన సూర్యరశ్మి పడితే హీట్ స్ట్రోక్, చర్మం ముడతలు, పొడిబారి పగిలి పోవడం, వేడితో అలసట లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. ఎండ నుంచి ఇండ్లలోకి రాగానే ముఖం, కాళ్ళు, చేతులు, శరీరాన్ని చల్లని నీటితో కడుక్కోవడం పాటిస్తే రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుందని తెలుసుకోవాలి. ఇంటికి రాగానే ఐస్ బ్యాగ్‌తో ముఖం, మెడ, చేతులను రుద్దు కోవాలి. ఎండ నేరుగా ముఖం, తలపై పడకుండా చూసుకోవాలి. మద్యాహ్నా వేళ వంట చేయడం మానేయాలి. వంటగదిలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్‌లో ఉంచాలి.

నీటిని ఎక్కువగా తాగడం:

ఎండకు మంచి నీరే దివ్య ఔషధం అని మరువరాదు. ఎండ, వడగాలుల్లో పని చేసినపుడు చమట రూపంలో శరీరంలోని నీటి శాతం తగ్గిపోయి ప్రమాదకర డీహైడ్రేషన్ (నిర్జలీకరణం) సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఎండల్లో తిరుగుతూ కఫీన్ రసాయనం అధికంగా ఉన్న టీ తాగడం మంచిది కాదు. వడ దెబ్బకు ఉత్తమ ఔషధంగా మట్టి పాత్రల్లోని చల్లని నీరు, చిటికెడు చక్కర/ఉప్పు కలిపిన నీళ్లు, నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, ఇంట్లో చేసిన షర్బత్ ద్రవాలు, మజ్జిగ, తాజా పండ్ల రసాలు తీసుకోవడం ఉత్తమం. ఆల్కహాల్ సేవనంతో డీహైడ్రేషన్ పెరుగుతుందని గమనించి పూర్తిగా తగ్గించాలి.

తేలికపాటి సీజనల్ ఫుడ్స్ తీసుకోవడం:

నీటి శాతం అధికంగా ఉన్న మామిడి పండ్లు, పుచ్చకాయ, కీర దోసకాయ, పాలకూర, కర్బూజ, స్ట్రాబెర్రీ, ద్రాక్ష పండ్లు లాంటిని తీసుకోవడం మంచిది. వేసవిలో లభించే సీజనల్ ఫుడ్స్ తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్ల రసాల కన్న పండ్లను పూర్తిగా తినడం మంచి అలవాటు. వేసవిలో గుల్కంద్, కొద్ది ఘాటైన పెప్పర్/చిల్లీ ఫుడ్స్ వాడడం మంచిది. దోసకాయ, గుమ్మడి కాయ, పొట్లకాయ, చికెన్ గ్రేవీ, గుడ్లు లాంటి ఆహారం తీసుకోవడం ఉత్తమమని తెలుసుకోవాలి. వేసవిలో టీ, కాఫీ, ప్రోటీన్ ఫుడ్స్ వల్ల డీహైడ్రేషన్ పెరుగుతుందని గమనించి వాటి వాడకాన్ని తగించాలి.

ఇండోర్‌లో పరిమిత వ్యాయామం:

ఉదయం 7 గంటల లోపు సమీప గార్డెన్స్‌లో వాకింగ్, వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎండలో కాకుండా ఇండోర్స్‌లో శారీరక వ్యాయామం, వీలైతే స్విమ్మింగ్ చేయాలి. అతిగా వ్యాయామం చేసినపుడు డీహైడ్రేషన్ సమస్యలను కొని తెచ్చుకోరాదు. వ్యాయామం చేస్తున్నపుడు మధ్య మధ్య విశ్రాంతి లేదా బ్రేక్స్ తీసుకోవడం ఉత్తమం. వేసవిలో సరి కొత్త వ్యాయామాలు చేయడం సముచితం కాదు. తొలిసారి యోగా, జిమ్ లాంటి వ్యాయామాలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాళ్లకు బూట్లు, చెప్పులు లేకుండా వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి.

ఇంటిని చల్లగా ఉండేలా జాగ్రత్తలు:

ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడి గదులు కూల్‌గా ఉండే విధంగా శ్రద్ధ తీసుకోవాలి. కిటికీలకు కర్టెన్స్ అమర్చుకోవడంతో ఎండ నేరుగా ఇంట్లోకి ప్రవేశించదని తెలుసుకోవాలి. మధ్యాహ్న వేళల్లో వడగాలులు ప్రవేశించకుండా కిటికీలు మూసి వేయడం, సాయంత్రం తిరిగి తెరవడం మంచిది.

నిద్రకు ప్రాధాన్యం:

అతి వేడి, అతి చల్లదనం నిద్రను భంగపరుస్తుంది. నిద్రకు ముందు స్నానం చేయడంతో శరీర వేడి తగ్గి నిద్రకు ఉపకరిస్తుంది. ప్రతి రోజు 6 - 8 గంటలు నిద్ర పోవాలి. నిద్రకు 2 గంటల ముందు వ్యాయామం చేయడం మంచిది కాదు. సాయంత్రం అతిగా తినడం, ఆల్కహాన్ తాగడం, పొగ తాగడం మానేయాలి. పడక గదికి టివీ, సెల్‌ఫోన్, ట్యాబ్స్, ట్యాబ్లెట్స్ తీసుకురావద్దు.

సన్‌స్క్రీన్స్ వాడకం:

వేసవి తాపానికి చర్మం, తల వెంట్రుకలకు హాని కలుగుతుంది. ఎండ వల్ల సన్‌బర్న్స్, హీట్ రాషెస్, వెంట్రుకలు రాలి పోవడం లాంటి అనారోగ్యాలు పెరుగుతాయి. ఎండలోకి వెళ్లే ముందు చర్మానికి/వెంట్రుకలకు మాక్చరైజర్స్, లోషన్స్, జెల్స్ వాడడం మంచిది. మన చర్మ స్వభావాన్ని బట్టి ముఖం, మెడ, ఎండ పడే శరీర ప్రాంతాలకు తగిన సన్‌స్క్రీన్ లోషన్స్ 3 గంటలకు ఒకసారి వాడడం మరువరాదు. పెదవులు పగలకుండా తగిన లిప్ స్టిక్, ఫేసియల్ వైప్స్ వాడాలి. స్ప్రే బాటిల్‌తో ముఖంపై చల్లని నీరు చల్లుకోవాలి. శరీరాన్ని తుడుచుకోవడానికి తడి కాటన్ బట్టను వాడండి.

వేసవికి తగిన తేలికపాటి కాటన్ వస్త్రధారణ:

వేసవి తాపాన్ని తట్టుకొనే తేలికైన, వదులు, పలుచని, తెల్లరంగు కాటన్ లేదా లైనెన్ వస్త్రాలు, లూజ్ పైజామా, ధరించాలి. లెదర్, అక్రైలిక్, మందపు సిల్క్ వస్త్రాలు, జీన్స్ వాడరాదు. మెడకు స్కార్ఫ్, చేతులకు గ్లౌజులు, టోపీలు, జాకెట్స్ వాడడం మంచి మార్గంగా గమనించాలి. ఉతికి ఆరేసిన బట్టలు పూర్తిగా ఎండే విధంగా చూసుకోవాలి.

వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ఆహారం, అసురక్షిత నీటి నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వేసవి కాలంలో పిల్లలు, వృద్ధులపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం అనిపిస్తే సాధారణ ప్రాతిపదికన డాక్టర్ చెకప్‌లు చేయించుకోవాలి. మధ్యాహ్న వేళ ఇంటిలో ఉండడం అన్నింటి కన్న ఉత్తమమైన మార్గం అని తెలుసుకొని మసలుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

రఘురాం రెడ్డికి భారీ మెజారిటీ అందిద్దాం..

- చావా శివరామకృష్ణ ఆత్మీయ సమావేశంలో మంత్రి పొంగులేటి



ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): ఈ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిద్దాం అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం పోలీస్ హౌసింగ్ కాలనీలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు.

అధిక సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజా సేవ కోసం ఎంపీగా పోటీ చేస్తున్నారని, అంతా ఆదరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పనిచేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు హాజరై... రఘురాం రెడ్డి కోసం ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, విద్యా, మౌలిక వసతుల చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్, సీనియర్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, మద్దినేని స్వర్ణ కుమారి, ఎంపీపీ మంగీలాల్ తదితరులున్నారు.

ఎన్నికల వేళ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించిన చమురు కంపెనీలు

లోక్‌సభ ఎన్నికల వేళ చమురు కంపెనీలు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల కమర్షిల్ గ్యాస్ సిలిండర్ ధరను రూ.19 తగ్గిస్తున్నట్లు ఆయిల్ కంపెనీలు తెలిపాయి. పెంచిన ధరలు మే 1 నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటించింది. అయితే ఇళ్లలో వంటకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్‌ల ధరలను తగ్గించలేదు. 19 కిలోల వాణిజ్య ఇండేన్ ఎల్‌పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం ఢిల్లీలో రూ.1,764.50 ఉండగా.. తాజాగా రూ.19 తగ్గడంతో రూ.1,745.50కి చేరింది. కోల్‌కతాలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1879 నుంచి రూ.1860కి తగ్గింది. హైదరాబాద్‌లో కూడా రూ.1994.50కు దిగివచ్చింది. గత నెలలోనూ 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.30.50 తగ్గింది. ఇళ్లలో ఉపయోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.802.50గా ఉంది. ఉజ్వల స్కీమ్ కింద కేవలం రూ.502కే లభిస్తోంది.

బస్సులో తరలిస్తున్న 2.40కోట్ల నగదు సీజ్

అమరావతి, మే2ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో భారీగా నగదును పోలీసులు సీజ్ చేశారు. గోపాలపురం మండలం జగన్నాథపురం గ్రామ శివారులోని అంతర్ జిల్లాల చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును తనిఖీ చేశారు. అందులో తరలిస్తున్న రూ.2.40 కోట్ల నగదును గుర్తించారు. దానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు దేవరపల్లి సర్కిల్ సీఐ బాలసురేష్‌బాబు తెలిపారు.

మరోవైపు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన సైబరాబాద్ పోలీసులకు తాజాగా దాదాపు 4 వేల లీటర్ల మద్యం పట్టుబడింది. హైదరాబాద్ బాచుపల్లి, పేట్ బషీరాబాద్, బాలానగర్ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పుస్తెలు తెగడంలోనూ తెలంగాణ నెంబర్ వన్ - ఈటల రాజేందర్

-కెసిఆర్ మధ్యం పాలసీతో పెరిగిన దుకాణాలు

-రోజు రోజుకు పెరుగుతున్న మద్యం అమ్మకాలు

-లిక్కర్ అధికంగా సేవించడంతో పెరుగుతున్న మరణాలు

-బోడుప్పల్ ప్రచార సభలో బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్

హైదరాబాద్, మే2:ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని ధరణిని కేసీఆర్ తీసుకువచ్చారని, కానీ ధరణి వల్ల ఎంతో మంది నష్టపోతున్నారన్నారు మల్కాజిగిరి లోక్ సభ బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ . తెలంగాణ అన్నింటా మొదటి స్థానంలో ఉందని.. అలాగే పుస్తెలు తెగడంలో కూడా మొదటి స్థానంలో అన్నారు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ ఆకృతి టౌన్ షిప్ వాసులతో బ్రేక్ ఫాస్ట్ మీట్‌లో మాట్లాడుతూ.. మద్యం సేవించడంలో కూడా తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఒకప్పుడు పండగలకు మాత్రమే తాగేవారని ఇప్పుడు తాగడం రోజువారీ పని అయిపోయిందన్నారు. దీంతో మరణాలు అధికంగా సంభవిస్తున్నాయన్నారు..

తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్లల్లో సన్న బియ్యం పెట్టమని జీవో ఇచ్చానని గుర్తు చేశారు.

కరోనా సమయంలో బాధితుల వద్దకు వెళ్ళి వారికి ధైర్యాన్ని కలిపించి ఎందరో ప్రాణాలు కాపాడానని అన్నారు. అసలు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరికైనా తెలుసా, దందాల కోసం రాజకీయాలకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఓటు వేస్తేనే పదవి వస్తుందన్నారు. సమాజం చల్లగా ఉంటేనే నాయకులు చల్లగా ఉంటారని అన్నారు. మోదీకి ఓటు ఎందుకు వేయాలో అభినందన్ తల్లిని మోదీకి ఎందుకు ఓటు వేయాలో ఇస్రో శాస్త్రవేత్తలను , టాయిలెట్లను ఇంటింటికి కట్టించి వాటిని ఉపయోగిస్తున్న మహిళలను అడగాలన్నారు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారు చేయించి వ్యాక్సిన్ ను ఉచితంగా ఎవరెవరు వేయించుకున్నారో వారిని అడగాలి మోడీకి ఎందుకు ఓటు వేయాలో అని అన్నారు. 16 ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ ఇన్సిట్యూట్‌లు ప్రారంభించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అలాగే 10 సంత్సరాలలో ఎక్కడైనా మోడీ తలదించుకునే పని చేశారా అని ప్రశ్నించారు.

అనంతపురం జిల్లాలో నాలుగు కంటైనర్ల కరెన్సీని పట్టుకున్న పోలీసులు

అమరావతి మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాలోని పామిడి వద్ద నాలుగు కంటైనర్ల కరెన్సీని పోలీసులు పట్టుకున్నారు. ఒక్కో కంటైనర్‌లో రూ.500 కోట్ల చొప్పున మొత్తం నాలుగు కంటైనర్లలో రూ.2 వేల కోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కంటైనర్లలో 500 నోట్లు ఉన్నట్ల ప్రాథమికంగా గుర్తించారు. కొచ్చి నుంచి హైదరాబాద్ వస్తుందని ఆర్‌బిఐ అధికారులు తెలిపారు. రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఫార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్న విషయం తెలిసిందే.

ఏపీ ప్రభుత్వం ఉద్యోగులకు కరెంట్ షాక్

అమరావతి, మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఎన్నికల సమయంలో ఏపీ ప్రభుత్వం ఉద్యోగులకు కరెంట్ షాక్ ఇచ్చింది. ప్రభుత్వం కల్పించిన అకామిడేషన్‌లో కరెంటు బిల్లులు ఎక్కువ రావడంతో.. అపార్టమెంట్లలో ఉన్న వారి వద్ద నుంచే వసూలు చేయాలంటూ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ సెక్రటేరియట్, అసెంబ్లీ, విభాగాధిపతి కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి షేరింగ్‌పై ప్రభుత్వం అకామిడేషన్ ఇస్తున్న విషయం తెలిసిందే. వీరు ఉంటున్న ఫ్లాట్‌ల విద్యుత్ బిల్లులు పరిమితికి మించి వస్తుండడంతో బిల్లులు చెల్లించాలని జీఏడీ అకామిడేషన్ విభాగాన్ని విద్యుత్ శాఖ కోరింది. ఈ క్రమంలో పరిమితికి మించి 2లక్షల 79వేల 23 రూపాయలు విద్యుత్ వాడిన ఉద్యగులకు జీఏడీ అకామిడేషన్ విభాగం షాక్ ఇచ్చింది. ఇచ్చిన పరిమితికి మించి విద్యుత్ వినియోగించుకున్న ఉద్యోగులకు ప్రభుత్వం బిల్లు చెల్లించదని స్పష్టం చేసింది. పరిమితికి మించి వచ్చిన విద్యుత్ బిల్లులను ఆయా ఫ్లాట్‌లలో ఉన్న ఉద్యోగుల నుంచే వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. లేని పక్షంలో వారి విద్యుత్ కనెక్షన్ తొలగించే ప్రమాదం ఉందని పేర్కొంటూ సర్వీస్ అసోషియేషన్‌లకు ప్రభుత్వం తరపు నుంచి లేఖ రావడం ఉద్యోగులకు షాక్ గురయ్యేలా చేసింది.

రాబోయే మూడు రోజులలో తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడా వర్షాలు

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలుగు రాష్ట్రాల్లో వేడిగాలులు వీస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. రాబోయే మూడు రోజులలో అనుకూల వాతావరణ పరిస్థితులను తీసుకురావచ్చని వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు. తాజా వాతావరణ సూచన ప్రకారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.గురు, శుక్ర, శనివారాల్లో ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాంలో కొన్ని ప్రాంతాల లో ఉరుములు గంటకు 40-50 కి. మీ వేగంతో ఈదురు గాలులు వీ యవచ్చని సమాచారం. పొడి వాతా వ ఓరణం అంచనా, గురు, శుక్రవారాల్లో దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లోని ఏకాంత ప్రదేశాలలో వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది, ఆ తర్వాత శనివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జ ఓల్లులు కురిసే అవకాశం ఉంది, ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

సుజనాకు మద్దతు ప్రకటించిన మైనారిటీ నేతలు..

అమరావతి, మే2మైనారిటీలను తాను ఓటు బ్యాంకుగా చూడబోనని, వారిలో ఒకడిగా ఉండి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని విజయవాడ పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. సుజనా చౌదరిని ముస్లిం సంఘాల నేతలు కలుసుకున్నారు. సుజనాను అభినందించారు. వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలో ముస్లింల కోసం చేపట్టబోయే కార్యాచరణను సుజనా వివరించారు. ప్రతి డివిజన్ లో కార్యాలయం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. మైనారిటీ మహిళలు సొంతంగా ఎదిగేలా రుణాలు ఇప్పించే చర్యలు తీసుకుంటామని, ప్రతిభ ఉన్న మైనారిటీ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేలా సాయం అందిస్తామని తెలిపారు.

నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. తాను మాట తప్పి పని చేయకపోతే ఎవరైనా ప్రశ్నించవచ్చని సుజనా స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను కొన్ని పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానం చేసి ముస్లిం, క్రిస్టియన్, ఎండోమెంట్ ఆస్తులను కాపాడతామన్నారు. గత అయిదేళ్ళలో అబద్ధాలు, అసత్యాలను ప్రజలు నమ్మి ఎన్నో ఇబ్బందులు పడ్డారని వివరించారు. తనను గెలిపిస్తే, పని చేసి చూపిస్తానన్నారు.

జగన్ కోసం సిద్ధం ఘరూ! పేదలే పార్టీ స్టార్ క్యాంపెయినర్లు- సజ్జల

అమరావతి, మే2 ఏపీలో 175 నియోజకవర్గాల్లో 47 వేల బూత్ కమిటీల నిర్మాణం పూర్తి చేశామని, ఒక్కో బూత్ కమిటీలో పది మంది సభ్యులుంటారని, వీరందరితో ఇంటింట ప్రచారంకార్యక్రమం చేపట్టాం, జగనన్న కోసం సిద్ధం పేరుతో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నవరత్నాల క్యాలెండర్, మేనిఫెస్టో కలిసి ఉండేలా ఒక రికార్డు తయారు చేశామని, వచ్చే అయిదేళ్లల్లో తమ ప్రభుత్వం ఏం చేస్తుందో తెలిపే రీతిలో నిత్యం కనపడేలా ఏర్పాటు చేశామని సజ్జల అన్నారు.

డిసిడబ్ల్యూలో నియమించిన 223 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగింపు

- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమోదం

న్యూఢిల్లీ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: నిబంధనలు పాటించకుండా ఢిల్లీ మహిళా కమిషన్(డిసిడబ్ల్యూ)లో నియమించిన 223 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాలన్న ప్రతిపాదనకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమోదం తెలియచేసినట్లు అధికారులు గురువారంతెలిపారు. నిబంధనలను పాటించకుండా కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన 223 మంది ఉద్యోగులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిసిడబ్లుని ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. కాగా..ఈ ఉత్తర్వులపై డిసిడబ్లు మాజీ చైర్‌పర్సన్, ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలివాల్ మండిపడ్డారు.డిసిడబ్లు కాంట్రాక్టు ఉత్యోగులను తొలగిస్తూ ఎల్ సక్సేనా తుగ్లక్ ఉత్తర్వులు జారీచేశారని ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విమర్శించారు. మహిళా కమిషన్‌లో మొత్తం 90 మంది సిబ్బంది ఉన్నారని, వీరిలో 8 మందికి మాత్రమే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, మిగిలిన వారంతా ఒక్కొక్కరు 3 నెలల కాంట్రాక్టుపై పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ తొలగిస్తే మహిళా కమిషన్‌కు తాళం పెట్టాల్సిందేనని ఆమె చెప్పారు. తమ రక్తం, స్వేదంతో ఈ సంస్థను తయారు చేశామని, సిబ్బందిని, రక్షణను కల్పించాల్సిందిపోయి దాన్ని సమూలంగా ఎందుకు నాశనం చేస్తున్నారని స్వాతి ప్రశ్నించారు. తాను జీవించి ఉన్నంత వరకు మిహా కమిషన్ మూతపడకుండా కాపాడుతానని ఆమె స్పష్టం చేశారు. తనను జైలులో పెట్టండి కాని మహిళలను మాత్రం అణచివేయవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

అసంఘటిత కార్మికుల అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు చేపట్టాలి

-జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

కార్మిక, అసంఘటిత కార్మికుల అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు చేపట్టాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేసారు అసంఘటిత కార్మికులకు ఒక నిర్దిష్ట వయసు తర్వాత నెలా నెలా జీవిత కాలం ఫించన్ సదుపాయం కల్పించాలని అన్నారు. హైదరాబాద్లోని మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో జై స్వరాజ్ పార్టీ కార్మిక విభాగానికి చెందిన పెయింటర్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్మిక, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాము పోరాటం చేయడమే కాకుండా వివిధ రకాల కార్మిక సంఘాలు చేసే పోరాటాలకు మద్దతు ఇస్తామని కాసాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య ఉన్నా తనను సంప్రదిస్తే సహకరిస్తానని చెప్పారు. కార్మిక సమస్యలు పరిష్కరిస్తేనే సమ సమాజ నిర్మాణం వైపు అడుగులు పడతాయని జై స్వరాజ్ పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోలుకొండ రత్నం అన్నారు. తమకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికుల వల్ల ఉపాధి దొరకడం లేదని, స్థానికులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పెయింటర్స్ సంఘం కమిటీ అధ్యక్షుడు గూడెం బిక్షపతి అన్నారు. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి సుగూరు శ్రీనివాస్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఆర్ ఎస్ జే థామస్,పెయింటర్స్ కమిటీ ముఖ్య సలహాదారు మాటూరి కృష్ణ మోహన్, కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంధమల్ల మోహన్ బాబు, ప్రధాన కార్యదర్శి ముక్క రాజు, ఉపాధ్యక్షులు జంగ శ్రావణ్ కుమార్, అమ్మన బోయిన నర్సింహా , సంయుక్త కార్యదర్శులు సిహెచ్ సుమన్, కొన్నె యల్లయ్య, జెర్రిపోతుల అశోక్, టి. మోహన్, కోశాధికారి ఇందిరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు ఒక స్టోన్ క్వారీలో భారీ పేలుడు.. ముగ్గురు కార్మికులు మృతి

విరుద్దునగర్(తమిళనాడు)మే2: నగరంలోని ఒక స్టోన్ క్వారీలో బుధవారం భారీ పేలుడు సంభవించి ముఉ?గరు కార్మికులు మరణించారు. పేలుడు దాటికి వారి శరీరాలు తునాతునకలై గాలిలోకి ఎగిరిపడగా కొన్ని శిథిలాల కింద సమాధి అయ్యాయని పోలీసులు తెలిపారు. పేలుడు కారణంగా దట్టమైన పొగ, ఇసుక గాలిలోకి ఎగిసిపడినట్లు సమీప ప్రాంతాల ప్రజలు తెలిపారు. క్వారీని మూసివేయాలంటూ వారు రోడ్లపైకి వచ్చి ధర్నా చేశారు. పేలుడు దృశ్యాలు అక్కడి సిసిటివి కెమెరాలో రికార్డు అయ్యాయి.నిల్వ చేసేందుకు వాహనం నుంచి కార్మికులు పేలుడు పదార్థాలు దించుతున్న సమయంలో పేలుడు సంభవించిందని విరుద్దునగర్ జిల్లా ఎస్పి కె ఫిరోజ్ ఖాన్ అబ్దుల్లా తెలిపారు. పేలుడు తీవ్రతకు ముగ్గురు కార్మికుల తునాతునకలై గాలిలోకి ఎగిరిపడ్డాయని ఆయన తెలిపారు. పేలుడు పదార్థాలను తరలించడంలో జరిగిన అజాగ్రత్తే ఈ పేలుడుకు కారణం కావచ్చని ఆయన చెప్పారు. క్వారీకి పేలుడు సదార్థాలను ఉపయోగించడానికి లైసెన్సు ఉందని, అక్కడ భద్రతపరచడానికి కూడా లైసెన్సు ఉందని ఆయన చెప్పారు. క్వారీకి సంబంధించిన ఒక వ్యక్తిని ప్రశ్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ కొనుగోలులో అన్ని అక్రమాలే- మంత్రి పొంగులేటి

-బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటే

-ఈ రెండు పార్టీలను ఏడు అడుగుల గోతిలో పాతాల్సిందే..

ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వన్ని దొంగ మాటలు అని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని ఆ రెండు పార్టీలను ఏడు అడుగుల లోతుల గొయ్యి తీసి పాతి పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఖమ్మం జిల్లా తిరుమల పాలెం మండలం దమ్మాయిగూడెం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ నేడు నిర్వహించిన కార్నర్ మీటింగ్ మంత్రి మాట్లాడుతూ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో మోసం చేసిన బీజేపీని కెసిఆర్ ఎందుకు నిలదీయలేదన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే జైల్లో పెడతారని కెసిఆర్ కు భయమన్నారు. పగలు తిట్టుకోవడం రాత్రిపూట బతిమాలు కోవటం కెసిఆర్ కు అలవాటంటూ వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోనే కాదు దేశంలో ఒక్క సీటు రాని కేసీఆర్ ఖమ్మంలో నామా గెలిస్తే కేంద్ర మంత్రి ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. దీంతో బీజేపీతో పొత్తు ఉందని చెప్పకనే చెబుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ మంచినీళ్ల కోసం ఇబ్బంది పడొద్దన్నారు. తన నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడైనా ఇబ్బంది పడనీయకుండా చూసుకునే బాధ్యత నాది అన్నారు. కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది అంటున్న కేసీఆర్.. మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు మూడు రూపాయల యూనిట్ని 20 రూపాయిలకు కెసిఆర్ కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు

చేశారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనిటీ మూడు రూపాయల 50 పైసలకే కరెంటు కొంటున్నామన్నారు. దోచుకుంది కేసీఆర్ అంటూ కరెంటుని అడ్డం పెట్టుకొని అడ్డంగా పొంగులేటి మండిపడ్డారు.

మాజీ జడ్జి రామకృష్ణ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

- పోలీసులు మాత్రం యాక్షన్ తీసుకోవడం లేదని ఆయన ఆరోపణలు

అమరావతి మే 2(ఎక్స్ ప్రెస్ న్యూస్);: మాజీ జడ్జి రామకృష్ణ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా బి కొత్తకోటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వేడకోడవళ్లతో మాజీ జడ్జి రామకృష్ణ ఇంట్లోకి ప్రవేశించారు.

కిటికీలు, కారు అద్దాలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. గతంలో ఆయన ఇంటిపై దాడి చేశారు.

దీంతో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తన ఇంటిపై దాడి చేశారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన ఫిర్యాదు చేశారు. ఇప్పుడు కూడా వైసిపి కార్యకర్తలు చేసి

భారతీయ నాగరికత, సంస్కృతిని అప్రతిష్ట పాల్జేయడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్

- ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

లక్నో మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: స్వాతంత్ర్యం అనంతరం దిశను కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నాయకత్వ రహితంగా కూడా మారిపోయిందని ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. భారతీయ నాగరికతను, సంస్కృతిని అప్రతిష్ట పాల్జేయడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని దూషించడానికి, సనాతన ధర్మాన్ని అవమానించడానికి కాంగ్రెస్ నాయకులు పదేపదే ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.గతంలో యుపిఎ హయాంలో కేంద్ర హోం మంత్రిగా పనిచేసిన ఒక కాంగ్రెస్ నాయకుడు కాషాయ ఉగ్రవాదం పేరుతో భారతీయ సనాతన సంస్కృతిని అవమానించడానికి ప్రయత్నించారని ఆయన తెలిపారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం సమస్యలకు కాంగ్రెస్ విధానాలే కారణమని ప్రతి ఒక్కరికీ తెలుసునని ఆయన అన్నారు. నేడు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం మాత్రమే కాక ఈశాన్య ప్రాంతాలలోని ఉగ్రవాదం, అరాచకం సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని యోగి తెలిపారు.రాజ్యాంగంలోని 370వ అధికరణే ఉగ్రవాదానికి మూలమని ఆయనఅ భివర్ణిస్తూ దాన్ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ జమ్మూ కశ్మీరును అభివృద్ధిని ప్రధాన స్రవంతితో అనుసంధానం చేశారని ఆయన కొనియాడారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో 120 జిల్లాలకు విస్తరించిన నక్సలిజం ఇప్పుడు దేశంలోని కొన్ని రాష్ట్రాలలో రెండు, మూడు జిల్లాలకే పరిమితమైందని, త్వరలోనే అక్కడ కూడా నక్సలిజం అంతమైపోతుందని ఆయన చెప్పారు. ముస్లింలను బుజ్జగించే విధానాలతో కాంగ్రెస్ పార్టీ దేశంలో విభజన బీజాన్ని నాటిందని ఆయన ఆరోపించారు.

చైనా గ్వాంగ్‌డాంగ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై భూమి కుంగి 19 మంది మృతి

బీజింగ్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: చైనా దేశంలోని గ్వాంగ్‌డాంగ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఒక్క సారిగా భూమి కుంగిపోవడంతో 19 మంది మృతి చెందారు. మిజౌ-డాబు కౌంటీ నగరాల మధ్య జాతీయ రహదారి మధ్యలో రోడ్డు కుంగిపోవడంతో 18 వాహనాలు పడిపోయాయి. వాహనాల పొగలు వెలువడడంతో 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. రెస్యూ సిబ్బంది, పోలీసులు, ప్రభుత అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 19 మంది మృతి చెందగా మరో 49 మంది చికిత్స తీసుకుంటున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. గ్వాంగ్‌డాంగ్ ప్రాంతంలో వరదలు, సుడిగాలులు చోటుచేసుకోవడంతో వాతావరణ మార్పులు జరిగాయి. దీంతోనే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మే డే సందర్భంగా హెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ పేదలకు ఆహారం,బట్టల పంపిణి

లక్షద్వీప్‌లో ఒకసూపర్-స్పెశలిస్ట్ మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేయడం లో సాయపడ్డ భారతీయ కోస్తా తీరరక్షక దళం

న్యూఢిల్లీ, మే2కేంద్ర పాలిత ప్రాంతం లక్షద్వీప్ లోని మారుమూల ద్వీపాలు కవరత్తి లోను, అంద్రోత్ లోను 2024 ఏప్రిల్ 29 వ తేదీ మరియు 30 వ తేదీ లలో ఒక వైద్య చికిత్స శిబిరాన్ని ఎఐఐఎమ్ఎస్ న్యూ ఢిల్లీ యొక్క సహకారం తో మరియు ఆ కేంద్ర పాలిత ప్రాంతాని కి చెందిన పాలన యంత్రాంగం యొక్క సమర్థన తో భారతీయ కోస్తా తీర రక్షక దళం (ఐసిజి) నిర్వహించింది. ఈ శిబిరం లో ఒక్కొక్క దీవి కి చెందిన సుమారు 1,500 మంది పౌరుల కు నిపుణుల సంప్రదింపుల ను అందించడం తో పాటుగా అవసరమైనటువంటి మందుల ను కూడా ఉచితం గా సమకూర్చడమైంది.

స్త్రీ రోగ శాస్త్రం, శిశు వైద్యం, నాడీశాస్త్రం, చర్మ సంబంధి వైద్య శాస్త్రం, ఎముకల సంబంధి వైద్యం లతో పాటు మరిన్ని విభాగాల కు చెందిన 15 మంది వైద్య నిపుణుల తో కూడినటువంటి వైద్య చికిత్స జట్టు కు ఎఐఐఎమ్ఎస్ దిల్లీ యొక్క సంచాలకుడు డాక్టర్ శ్రీ ఎమ్. శ్రీనివాస్ నేతృత్వం వహించారు. మారుమూల ద్వీపాల లో ప్రజల కు సూపర్ స్పెశలిస్ట్ మెడికల్ కవరేజి ని అందజేయడం తో పాటు ఆయా రంగాల నిపుణుల తో వారికి అవసరమైన సూచనల ను, సలహాల ను ఇవ్వడం పై ఈ వైద్య శిబిరం శ్రద్ధ వహించింది. ఆ ప్రాంతాల లో వైద్య సంబంధి మౌలిక సదుపాయాల తాలూకు ప్రమాణాల ను పెంపొందించడం కోసం స్థానిక వైద్య వృత్తి నిపుణుల కు మౌలిక ప్రాణాధార (బిఎల్ఎస్) సంబంధి ఉపన్యాసాల ను కూడా వారు ఇచ్చారు.

ఈ శిబిరాన్ని కమాండర్ కోస్ట్ గార్డ్ రీజియన్ (వెస్ట్) యొక్క ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ భీష్మ్ శర్మ, సర్జన్ కమోడోర్ దివ్య గౌతమ్ గారు, వివిఎస్ఎమ్, ప్రిన్సిపల్ డైరెక్టర్ (మెడికల్ సర్వీసెస్), సిజిహెచ్‌క్యు లతో పాటు కేంద్ర పాలిత ప్రాంత పాలన యంత్రాంగం యొక్క ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ అవినాశ్ కుమార్, ఐఎఎస్ ల సమక్షం లో డాక్టర్ శ్రీ ఎమ్. శ్రీనివాస్ ప్రారంభించారు.

అస్సాంలో మాఫియా రాజ్యం నడుస్తోంది

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

ధుబ్రి(అస్సాం) మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: అస్సాంలో మాఫియా రాజ్యం నడుస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అనేక కుంభకోణాలలో కూరుకుపోయారని ఆమె ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ధుబ్రిలో ఒక సభలో ఆమె ప్రసంగిస్తూ తెలంగాణలో అసదుద్దీన్ ఒవైసీతో బిజెపికి సంబంధాలు ఉన్న తరహాలోనే ఐఎయుడిఎఫ్‌కు చెందిన బద్రుద్దీన్ అజ్మల్‌తో బిశ్వ శర్మకు రహస్య ఒప్పందం ఉందని ఆమె తెలిపారు.ఈ ఇద్దరు ముస్లిం నాయకుల లక్ష్యం కాంగ్రెస్‌ను ఓడించడమేనని ఆమె అన్నారు. జెడిఎస్ కు చెందిన కర్నాటక ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి తాజాగా వెలుగుచూసిన అశ్లీల వీడియోలను ప్రస్తావిస్తూ అలాంటి వ్యక్తి తరఫున బిజెపి ప్రచారం చేస్తోందని, అతను దేశం విడిచి పారిపోతుంటే బిజెపి ప్రభుత్వం అడ్డుకోలేదని ఆమె విమర్శించారు.ఎన్నికల బాండ్ల వివాదంపై బిజెపిని తీవ్ర స్థాయిలో ఆమె విమర్శించారు. కేవలం 10 ఏళ్లలో ప్రపంచంలోనే అతి సంపన్న పార్టీగా బిజెపి మారిందని కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్లు పాలించినా అంత సంపాదించలేకపోయిందని ఆమె విమర్శించారు. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాని నరేంద్ర మోడీకి పట్టడం లేదని, ఆయన తన అహంకార వైఖరితో సామాన్యుల సమస్యలను అర్థం చేసుకోవడం లేదని ప్రియాంక ఆరోపించారు.

జల ప్రవాహంపై తేలియాడే సౌరశక్తి సంబంధి సాంకేతికత ను భారతదేశంలో అమలు పరచడం కోసం నార్వేకు చెందిన కంపెనీతో జట్టు కట్టనున్న ఎన్‌హెచ్‌పిసి లిమిటెడ్

న్యూఢిల్లీ, మే2జల ప్రవాహం మీద స్థాపించినటువంటి తేలియాడే సౌర శక్తి పరిశ్రమ (ఫ్లోటింగ్ సోలర్ ఇండస్ట్రి) కు ఒక నిర్దిష్ట సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేది గా కార్యకలాపాల ను నిర్వహిస్తున్నటువంటి మెసర్స్ ఓశన్ సన్ అనే పేరు కలిగిన నార్వే కంపెనీ ఒకదాని తో ఓ అవగాహన పూర్వక ఒప్పంద పత్రం పైన ఎన్‌హెచ్‌పిసి లిమిటెడ్ సంతకాలు చేసింది. ఎన్‌హెచ్‌పిసి లిమిటెడ్ భారతదేశం లో విద్యుత్తు అభివృద్ధి రంగం లో అతి పెద్ద సంస్థ గా ఉంది. ఎమ్ఒయు లో పేర్కొన్న ప్రకారం, ఫోటోవోల్టాయిక్ ఫలకాల పై ఆధారపడి పని చేసేటటువంటి ఓశన్ సన్ యొక్క ఫ్లోటింగ్ సోలర్ ఎనర్జీ టెక్నాలజీ ని ఆచరణ లోకి తీసుకు రావడం కోసం సహకారం ప్రధానం అయినటువంటి ప్రముఖ రంగాల ను ఎన్‌హెచ్‌పిసి మరియు ఓశన్ సన్ లు అన్వేషించనున్నాయి. ఈ విధమైన ఫలకాల ను ఎన్‌హెచ్‌పిసి గుర్తించే సంబంధిత స్థలాల లో హైడ్రో-ఇలాస్టిక్ మెమ్బ్రేన్ స్ పై అమర్చడం జరుగుతుంది.

ఈ ఒప్పందం ఎన్‌హెచ్‌పిసి యొక్క దీర్ఘకాలిక అభివృద్ధి మరియు నవీకరణ యోగ్య శక్తి ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచాలనేప్యాసల లో భాగం. ఎన్ హెచ్ పిసి జల విద్యుత్తు అభివృద్ధి ఒక్కటే కాకుండా సౌర, పవన మరియు గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల వంటి విభిన్న నవీకరణ యోగ్య శక్తి ప్రాజెక్టుల లో కూడా నిమగ్నం అయి ఉన్నది.

ఎమ్ఒయు పైన ఎన్‌హెచ్‌పిసి కార్యనిర్వాహక సంచాలకుడు (రీన్యూ వబుల్ ఎనర్జీ ఎండ్ గ్రీన్ హైడ్రోజన్) శ్రీ వి. ఆర్. శ్రీవాత్సవ తో పాటు ఓశన్ సన్ యొక్క ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ క్రిస్టియన్ టోర్ వాల్డ్ లు 2024 ఏప్రిల్ 29 వ తేదీ నాడు హైబ్రిడ్ పద్ధతి లో సంతకాలు చేశారు. ఈ సంతకాల కార్యక్రమం లో పాలుపంచుకొన్నవారి లో భారతదేశం లో నార్వే రాయబారి మే-ఎలిన్ స్టేసర్ గారు; ఎన్‌హెచ్‌పిసి సంచాలకుడు, సాంకేతిక విషయాలు శ్రీ రాజ్ కుమార్ చౌధరీ మరియు ఎన్‌హెచ్‌పిసి కార్యనిర్వాహక సంచాలకుడు (స్ట్రటిజిక్ బిజినెస్ డివెలప్‌మెంట్ ఇ కన్సల్టెన్సీ) శ్రీ రజత్ గుప్తా లు న్యూ ఢిల్లీ లోని నార్వే రాయబార కార్యాలయం నుండి, నార్వే లో భారత రాయబారి డాక్టర్ శ్రీ ఎక్విసో విమల్ ఓస్లో నుండి ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

టీఎస్ ఐసెట్ -2024 దరఖాస్తుల గడువు మే 7వ తేదీ వరకు పొడిగింపు

హైదరాబాద్ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : టీఎస్ ఐసెట్ -2024 దరఖాస్తుల గడువు పొడిగించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 30వ తేదీతో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ముగిసింది. కానీ అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఎలాంటి ఆలస్యం రుసుం లేకుండా మే 7వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ఐసెట్ కన్వీనర్ ఇవాళ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, కాకతీయ యూనివర్సిటీ వీసీ టీ రమేశ్, కన్వీనరగ్ ప్రొఫెసర్ ఎస్ నర్సింహా చారి కలిసి అధికారికంగా ప్రకటించారు.ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.550, ఇతరులు రూ.750 రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో ఏవైనా తప్పులు, పొరపాట్లు ఉంటే అభ్యర్థులు మే 17వ తేదీ నుంచి 20 తేదీ మధ్య మార్పులు చేసుకోవచ్చు. మే 28వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 4, 5వ తేదీల్లో ఐసెట్ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ జూన్ 4వ తేదీన పార్ల మెంటు ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా ఐసెట్ పరీక్ష నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. దీని ప్రకారం.. జూన్ 5, 6వ తేదీల్లో ఐసెట్ పరీక్ష జరగనుంది. జూన్ 15న ప్రాథమిక కీ, జూన్ 16 నుంచి 19 మధ్య అభ్యంతరాల స్వీకరణ, జూన్ 28వ తేదీన ఫైనల్ కీ, ఫలితాలను జూన్ 28వ తేదీన విడుదల చేయనున్నారు.

జగన్ కోసం సిద్ధం షురూ! - పేదలే పార్టీ స్టార్ క్యాంపెయినర్లు - సజ్జల

అమరావతి, మే2 ఏపీలో 175 నియోజకవర్గాల్లో 47 వేల బూత్ కమిటీల నిర్మాణం పూర్తి చేశామని, ఒక్కో బూత్ కమిటీలో పది మంది సభ్యులుంటారని, వీరందరితో ఇంటింట ప్రచారంకార్యక్రమం చేపట్టాం, జగనన్న కోసం సిద్ధం పేరుతో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు.

తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నవంత్నాల క్యాలెండర్, మేనిఫెస్టో కలిసి ఉండేలా ఒక రికార్డు తయారు చేశామని, వచ్చే అయిదేళ్లల్లో తమ ప్రభుత్వం ఏం చేస్తుందో తెలిపే రీతిలో నిత్యం కనపడేలా ఏర్పాటు చేశామని సజ్జల అన్నారు. ప్రభుత్వ లబ్దిదారులే తమకు స్టార్ క్యాంపెయినర్లని సినిమా వాళ్లో మరొకరో స్టార్ క్యాంపెయినర్లు ఉండరని అన్నారు. పేద వర్గాలకు చెందిన 12 మందిని స్టార్ క్యాంపెయినర్లుగా ఎంపిక చేశామని, జగన్ కే ఎందుకు ఓటు వేయాలో వాళ్లు తెలియచేస్తారని, జగన్ కోసం సిద్ధం పేరిట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

తెలంగాణలో నిప్పులు కురిపిస్తున్న భానుడు

-ఉదయం నుంచే మండుతున్నఎండలు.. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న జనం

-46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):తెలంగాణలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం నుంచే ఎండలు మండుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఎండలకు తోడు వడగాలులు వీస్తుండడంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. బుధవారం జగిత్యాల జిల్లా జైనాలో 46.2, నల్గొండ జిల్లా మాడుగులపల్లిలో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.అల్లీపూర్ (జగిత్యాల) 46.1, కొత్తగట్టు (కరీంనగర్) 46, కోల్వాయి (జగిత్యాల) 46, వీణవంక 46, దూల్‌మిట్ట (సిద్దిపేట) 45.9, వెల్గటూరు (జగిత్యాల) 45.9, తెల్దేవరపల్లె 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వివరించింది. ఇదిలా ఉండగా.. రాగల ఐదురోజుల పాటు రాష్ట్రంలో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 2న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో దీర్ఘకాల వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటించింది. 3న నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. 4న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

తెలుగు ప్రముఖుల అభినందనగా...
(కవితా సంపుటి)
మద్దాళి రఘురామ్
16-05-2024 గురువారం
సాయంత్రం 6 గం॥లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), హైదరాబాద్.
నంది అవార్డు గ్రహీత
శ్రీమతి డి. సురేఖామూర్తి గారిచే
లలిత సంగీత విభావరి

ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్
హంస పురస్కార గ్రహీత, నృత్య గురువు డా॥ మద్దాళి ఉషాగాయత్రి
కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారం స్వీకరించిన సందర్భంగా
ఆత్మీయ సత్కారం
కిన్నెర కార్యదర్శి శ్రీ మద్దాళి రఘురామ్ రచించిన
తెలుగు ప్రముఖుల అభిమానిగా... (కవితా సంపుటి)
గ్రంథావిష్కరణ
ముఖ్యఅతిథి
డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (ర)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అధ్యక్షులు
ఆచార్య ఎస్. గోపి, పూర్వ ఉపకులపతి
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
డా॥ వోలేటి పార్వతీశం
ప్రముఖ సాహితీవేత్త
గౌరవ అతిథి
శ్రీమతి శైలజామిత్ర
ప్రముఖ రచయిత్రి
కృతి స్వీకర్త
శ్రీ టి.బి.వి. అయ్యవారు
పూర్వ ప్రిన్సిపాల్, చైతన్య జూనియర్ కాలేజి
హైదరాబాద్
తొలిప్రతి స్వీకర్త
శ్రీ బి.వి.ఎస్.ఎస్. ప్రకాశరావు
పూర్వ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్
ఆంధ్రప్రదేశ్
గుండిబండి వెంకటరెడ్డి, చైర్మన్
సెల్: 9849882783
వి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి
సెల్: 9866332738

రుజువు చేస్తే.. రేపే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

–బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బడా కార్పొరేట్లు అయినా అదానీ, అంబానీలకు పద్నాలుగున్నర లక్షల కోట్ల రుణాలను మోదీ మాఫీ చేయలేదని .. ఇదే బండి సంజయ్, కిషన్ రెడ్డి రుజువు చేస్తే.. రేపే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మే డే సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడారు. 2019 మార్చిలో కరోనా వచ్చింది. అప్పుడు దేశమంతా అల్లకల్లోలం. రవాణా సౌకర్యాలు స్తంభించిపోయిన పరిస్థితి. పిల్లలను ఎత్తుకుని, సూట్ కేసుల మీద పిల్లలను కూర్చోబెట్టుకొని హైవేల మీద వెళ్లిన పరిస్థితి. ఆ రోజులు మరిచిపోవద్దు. అప్పుడప్పుడు మరిచిపోయి లంగలకు ఓట్లు వేస్తే మన నెత్తి మీద కూర్చుంటారు. ఆనాడు మోదీ కార్మికులను పట్టించుకోలేదు. రైళ్లు, బస్సులు పెట్టమంటే చలనం లేదు. హృదయం లేని మనిషి నరేంద్ర మోదీ. కార్మికులను, కర్షకులను మోదీ చావగొట్టిండు అని కేటీఆర్ పేర్కొన్నారు. మన దేశంలో పెట్రోల్, డీజిల్ దొరకదు. ముడి చమురు తీసుకొచ్చి ప్రాసెస్ చేసి అమ్ముతుంటారు. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు.. ఇవాళ 84 డాలర్లు. ముడి చమురు ధర తగ్గితే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాలి కదా..? మోదీ దేవుడు కాబట్టి పెరిగినవి. డిజీల్, ప్రెటల్‌పై రాష్ట్రంలో పన్ను పెంచలేదు. సెస్‌ల పేరు మీద సుంకాలు వేసి పెట్రోల్, డీజిల్ ధర పెంచిండు మోదీ. ఈ పదేండ్లలో సెస్‌ల పేరు మీద 30 లక్షల కోట్లు వసూళ్లు చేశాడు మోదీ. ప్రతి రోజు సుంకం కడుతున్నాం. జాతీయ రహదారుల కోసం సెస్ పెట్టామని కేంద్రం చెబుతోంది. కానీ ప్రతి జాతీయ రహదారిపై టోల్ వసూళ్లు చేస్తున్నారు. ఒక దిక్కు టోల్.. ఇంకో దిక్కు సెస్‌లు గుంజుతున్నారు. మరి రూ. 30 లక్షల కోట్ల గురించి నిలదీస్తే వాస్తవం బయటపడింది. వీటిలో బడా కార్పొరేట్లు అయినా అదానీ, అంబానీలకు పద్నాలుగున్నర లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిండు మోదీ. నేను చెప్పేది తప్పని బండి సంజయ్, కిషన్ రెడ్డి రుజువు చేస్తే రేపు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

ఎన్నికల వేళ భారీగా పట్టుబడ్డ మద్యం..

హైదరాబాద్, మే2:ఎన్నికల వేళ నగరంలో భారీగా మద్యం పట్టుబడింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరాకు చెక్ పెట్టేందుకు పోలీసులు అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తరలిస్తున్న మద్యం పోలీసులకు చిక్కింది. తాజాగా దాదాపు నాలుగు వేల లీటర్ల మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. సైబరాబాద్ సీపీ నిర్దిష్టమైన సూచనల మేరకు సైబరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఎస్‌వోటీ పోలీసులు, వివిధ పోలీసు స్టేషన్ల సిబందితో కలిసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించి రవాణా అవుతున్న రూ. 37 లక్షల విలువగల నాలుగు వేల లీటర్స్ మద్యం పోలీసులకు చిక్కింది.

నాకు రాజ్యాంగమే ధర్మగ్రంథం

–నేను బతికి ఉన్నంత వరకు రాజ్యాంగాన్ని కాపాడుతాను
–దళితు లు, ఎస్టీలు, ఓబీసీలకు రిజర్వేషన్లకు అండగా ఉంటా.
–మతపరమైన ముస్లిం రిజర్వేషన్లను అమలు కానిచ్చే ప్రసక్తి లేదు
–కాంగ్రెస్ వస్తే రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుంది
–అల్లాదుర్గం లో బిజెపి భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ

మెదక్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: 'నాకు రా జ్యాంగమే ధర్మగ్రంథం. నేను బతికి ఉన్నంత వరకు రాజ్యాంగాన్ని కాపాడుతాను. దళితులు, ఎస్టీలు, ఓబీసీలకు రిజర్వేషన్లకు అండగా ఉంటా. మతపరమైన ముస్లిం రిజర్వేషన్లను అమలు కానిచ్చే ప్రసక్తి లేదు. కానీ కాంగ్రెస్ వస్తే రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుంద'ని ప్రధాని మోడీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లాలోని జహీరా బాద్ పార్లమెంటు పరిధిలో గల అల్లాదుర్గం లో బిజెపి భారీ బహిరంగ సభను నిర్వహిం చింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రధాని మోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాం గ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ముదిరాజ్, లింగాయ త్‌లకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ముస్లింలకు రిజర్వేషన్ల ద్వారా రాజ్యాంగ వ్యతిరేక మతపర రిజర్వేషన్లకు పూనుకుందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బంజారా సమాజాన్ని కూడా మోసం చేశాయన్నారు. లింగాయత్‌ల రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకమని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి ఎపిలో రికార్డ్ స్థాయి ఎంపి సీట్లు వచ్చాయని, అయినా దళితులు, ఒబిసిలకు అన్యాయం చేసిందన్నారు. రాజ్యాంగం అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదన్నారు. అంబేద్కర్ విషయంలోనూ అవమానకరంగా వ్యవహరిం చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రాజ్యాంగానికి వ్యతిరేకమే అన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ రాజ్యాంగాన్ని పలుమార్లు అవమానించారన్నారు. ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని దుయ్యబట్టారు. నాడు ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను యువరాజు మీడియా ముందే చించివేయడం ద్వారా ప్రధానిని, రాజ్యాంగాన్ని అవమానించా రన్నారు. బిసి, ఎస్సి, ఎస్టిల హక్కులను కాలరాస్తూ మతపరమైన రిజర్వేషన్లను పెట్టి రాజకీయాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ రాజకీయ అవసరాల కోసం రాజ్యాంగాన్ని ఉపయోగించుకుందని ఆరోపించారు. రాజీవ్ గాంధీ హయాంలో స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. రాజ్యాంగాన్ని తాను పవిత్ర గ్రంథంలా భావిసానని ప్రధాని అన్నారు. తాను మొదటసారి ప్రధానిగా అయినప్పుడు పార్లమెంట్ భవనం ముందు మోకరిల్లానని గుర్తు చేసుకున్నారు. 2019లో రెండోసారి ప్రధాని అయ్యాక రాజ్యాంగ పవిత్ర గ్రంథాన్ని సెంట్రల్ హాలులో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని ఏనుకు అంబారీపై ఊరేగించానని, ఆ ఊరేగింపుతో తాను నడిచానన్నారు. తాను తొలి రోజు నుంచీ రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నానన్నారు. రాజ్యాంగానికి గౌరవం ఇచ్చిన ఒకే ఒక్క ప్రధానమంత్రిని తానేనన్నారు. రాజ్యాంగం అంటే తనకు మహాభారతం, రామాయణం, బైబిల్, ఖురాన్ వంటి పవిత్ర గ్రంథమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అన్యాయం చేసే మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని పునరుద్ఘాటించారు. రాజ్యాంగంపై తన చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరన్నారు. 'తెలంగాణ నుంచి ప్రకటిస్తున్నాను నేను మూడోసారి ప్రధాని అయ్యాక 75 ఏళ్ల రాజ్యాంగం సందర్భంగా అంగరంగ వైభవంగా ప్రతి పల్లెలో, ప్రతి పట్టణంలో రిపబ్లిక్ డేను నిర్వహిస్తాం' అన్నారు. ఈ దేశాన్ని పాలించే హక్కు తమకు ఉందని కొందరు రాజవంశీకులు భావిస్తున్నారని చురక అంటించారు. ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు.

'భారత్‌ను కాంగ్రెస్ అవినీతి ఊబిలోకి నెట్టివేసింది'

తెలంగాణలో కాంగ్రెస్ డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట పంచసూత్రాలతో పాలన చేస్తుందని వెల్లడించారు. పదేళ్లలో దేశమెంత అభివృద్ధి చెందిందో అంతా చూశారన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అందరూ చూశారన్నారు. ప్రపంచమంతా అభివృద్ధి చెందుతుంటే భారత్‌ను కాంగ్రెస్ అవినీతి ఊబిలోకి నెట్టివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నచోట పంచ సూత్రాలతో పాలన చేస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్ పంచ సూత్రాలు అంటే అవినీతి, అబద్ధాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు, మాఫియా, కుటుంబ రాజకీయాలు అని ఎద్దేవా చేశారు. దేశంలో మళ్లీ పాతరోజులు తీసుకురావాలని కాంగ్రెస్ చూస్తోందని విమర్శించారు. ఈ పంచసూత్రాల పాలన ప్రజలకు అర్థమైందని వారి మాయలో ప్రజలు పడొద్దని హెచ్చరించారు. ఓటమి నైరాశ్యంలో కాంగ్రెస్ నేతలు దిగజారుతున్నారని విమర్శలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఫేక్ వీడియో సృష్టించారన్నారు. ఆ ఫేక్ వీడియోలను విడుదల చేసేవారిని వదిలి పెట్టమని హెచ్చరించారు. విపక్ష కాంగ్రెస్‌కు ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని, చరిత్రలో ఎన్నడూ రానంత తక్కువ సీట్లు కాంగ్రెస్‌కు వస్తాయని జోస్యం చెప్పారు. 'రైతులను భగవత్ స్వరూపాలుగా బిజెపి చూస్తుంది. 100 రోజుల్లో రుణమాఫీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసింది. క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీను కాంగ్రెస్ నెరవేర్చలేదు. బిఆర్ఎస్ పాలనలో ఓటుకు నోటు కేసును తొక్కిపెట్టింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ వేర్వేరు కాదు. బిజెపి వల్లే మహిళలకు రక్షణ. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తేనే ప్రజల సంపదకు రక్షణ ఉంటుంద'ని మోడీ అన్నారు. 'అయోధ్యలో రామమందిర నిర్మాణం 500 ఏళ్ల భారతీయుల స్వప్నం. అయోధ్యలో రామమందిరం నిర్మాణం మోడీ వల్ల కాదు, మీ ఓటు వల్లే సాధ్యం అయింది. ప్రభుత్వం పటిష్టంగా ఉంటే కొత్త చరిత్రను ఎలా సృష్టిస్తామో మీరు చూశారు. హైదరాబాద్‌లో పండుగలు జరుపుకోవాలంటే ఎన్నో ఆంక్షలు ఉన్నాయి. ఓ వర్గం ఓట్ల కోసమే హైదరాబాద్‌లో పండుగలపై ఆంక్షలు విధించారు. మీరు వేసే ఒక్కొక్క ఓటు మీ కలలు సాకారం కోసం వినియోగిస్తా'నని మోడీ అన్నారు.

'ట్రిపుల్ ఆర్ టాలీవుడ్ తీస్తే తెలంగాణలో డబుల్ ఆర్ నడుస్తుంది'

తెలంగాణలో డబుల్ ఆర్ ట్యాక్స్ నడుస్తుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ గెలిస్తే మీపై వారసత్వం పన్ను వేయబోతున్నారని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఆర్ ట్యాక్స్ అంటే ఇప్పటికే మీకు అర్థమయి ఉంటుందన్నారు. డబుల్ ఆర్ ట్యాక్స్‌ను వ్యాపారవేత్తలు కట్టాల్సిని వస్తుందన్నారు. డబుల్ ఆర్ ట్యాక్స్‌కు షాక్ ఇవ్వకపోతే తెలంగాణ లో రానున్న ఐదే ళ్లలో మరింత పతనమవుతుందని తెలిపారు. మీ సంపదలో 55 శాతం వెనక్కు లాక్కుంటామని చెబుతుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అవినీతి ఢిల్లీ లిక్కర్ స్కామ్ వరకూ పాకిందన్నారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ట్రిబుల్ ఆర్‌తో సూపర్ హిట్ సినిమా ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేసి ఢిల్లీకి డబ్బులు పంపుతుందని వెల్లడిం చారు. కేంద్రంలో కాంగ్రెస్ వస్తే ప్రజల సొమ్ముకు రక్షణ లేకుండా పోతుం దన్నారు. లిక్కర్ కేసు బయటపడ్డాక ఇద్దరు తోడు దొంగలు ఎవరో అర్థమయిందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ఒకగూటి పక్షులేనన్నారు. మొన్నటి వరకు తెలంగాణను బిఆర్ఎస్ దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ తెలంగాణను దోచుకుంటోందని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం అతి పెద్ద కుంభకోణం అని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఓటుకు నోటు కేసును తొక్కిపెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ వేర్వేరు కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం స్కాంపై కాంగ్రెస్ మాట్లాడిందన్నారు. అధికారంలోకి రాగానే కాళేశ్వరం స్కాంను తొక్కిపట్టిందని విమర్శించారు. స్కాంలపై కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు నహకరించుకుంటున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో ఆందోళన కలిగిస్తూ తెలంగాణ సమాజాన్ని విచ్ఛిన్నం చేయుటకు కాంగ్రెస్ యత్నం అలాంటి వారి ఆటలు సాగనివ్వంగల్లీ గల్లీలో కాంగ్రెస్ చేస్తున్న పాపాలను కార్యకర్తలకు వివరించి మూడవసారి బిజెపిని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలను కోరారు. రాజ్యాంగం రచించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో రాజ్యాంగంపై రాజ్యవంశీయులైన రాహుల్‌గాంధీ కుటుంబం చేసిన పాపాలను ఎండగట్టంతో పాటు వారి బాగోతాలు బయటపెడతామని హెచ్చరించారు. ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో ఆందోళన కలిగిస్తూ తెలంగాణ సమాజాన్ని విచ్ఛిన్నం చేయుటకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, అలాంటి వారి ఆటలు సాగనివ్వమన్నారు. పేదవారి సంక్షేమమే బిజెపి సంకల్పమని తెలంగాణ ప్రజల్లో బిజెపిపై అత్యంత విశ్వాసం కనబరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు నాలుగు వందేభారత ఎక్స్‌ప్రెస్‌లతో పాటు 40 రైల్వేస్టేషన్లు ఇచ్చామని గుర్తు చేస్తూ రాష్ట్రంలో ఎన్నో జాతీయ రహదారులు వేసి రవాణా సౌకర్యం కల్పించడమే కాకుండా అన్ని రంగాలలో రాష్ట్రానికి సముచిత న్యాయం చేశామన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు, కామారెడ్డి ఎంఎల్ఏ వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మహిళా మోర్చా, యువ మోర్చా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు పాల్గన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు తేడా లేమీ లేదు-బండి సంజయ్

–కెసిఆర్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ మంత్రి
–ఫోన్ ట్యాపింగ్ కేసును పక్కదారి పట్టించేది ఆ మంత్రే
–కెసిఆర్, కెటిఆర్ తో ఆ మంత్రి మిలాఖత్
–కెసిఆర్ అరెస్ట్ కాకుండా అడ్డుపడుతున్నది అతనే
–బిజెపి ఎంపి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, మే2:బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు పెద్ద తేడా ఏమీ లేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మాదిరిగానే రేవంత్ పాలన సాగుతోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై ట్యాపింగ్ కేసును నీరుగార్చారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ఎన్నికల వేళ రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెర లేపారని ధ్వజమెత్తారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఫైర్ అయ్యారు. ఇప్పటికే ఆ కేసులో కొంతమంది పోలీసులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని గుర్తు చేశారు. అంత పెద్ద కేసు ప్రస్తుతం చర్చలో లేకుండా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును నీరు గార్చేందుకు, కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ మంత్రి ప్రయత్నిస్తున్నాడంటూ ఆరోపించారు. అదే మంత్రి కేసీఆర్, కేటీఆర్‌లతో లాలూచి పడి, చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని ఫోన్ ట్యాపింగ్ కేసును పక్కదోవ పట్టించారన్నారు. మాజీ మంత్రి హరీష్ రావుకు కూడా ఫోన్ ట్యాపింగ్‌కు బాధితుడేనని, అందుకే ఆయనకు ఏడాది పాటు మంత్రి పదవి ఇవ్వలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ స్టేట్‌మెంట్‌లో కూడా కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేశానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. అయినా..ఈ కేసులో ప్రభుత్వం మిన్నకుండిపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీకి నిదర్శనం కాదా.. అని బండి సంజయ్ ప్రశ్నించారు..

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని చెప్పారు. తమ మేనిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీత అని కాంగ్రెస్ నేతలు చెప్పారని మండిపడ్డారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం, పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయని కాంగ్రెస్ నేతలు చెప్పే మాటలను ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. భారత రాజ్యాంగం గురించి ఆయన మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటమి ఖాయమైందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఆహారం సంక్షోభం

– ఓ సర్వేలో వెలుగులోకి వచ్చిన సంచలన విషయాలు

న్యూ ఢిల్లీ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):ప్రపంచవ్యాప్తంగా ఆహారం సంక్షోభం గురించి ఇటీవల వచ్చిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో 2023లో 59 దేశాల్లో దాదాపు 282 మిలియన్ల మంది ప్రజలు తీవ్రమైన ఆకలిని ఎదుర్కొన్నారని సర్వే తెలిపింది. ఈ సంఖ్య 2022 కంటే 2.4 కోట్లు ఎక్కువ ఉండటం విశేషం. ఆహార సంక్షోభంపై గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం ఆకలితో అలమటిస్తున్న వారిలో పిల్లలు, మహిళలు ఎక్కువగా ఉన్నారని వెల్లడించింది. 32 దేశాలలో 36 మిలియన్లకు పైగా ఐదేళ్లలోపు పిల్లలు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారని నివేదిక తెలిపింది. దీని కారణంగా గాజా స్ట్రిప్, సూడాన్‌లలో ఆహార భద్రత పరిస్థితి మరింత దిగజారిందని గుర్తు చేసింది. మొత్తంగా 2023లో పోషకాహార లోపం పరిస్థితి మరింత దిగజారిందని వెల్లడించింది. దీనికి రెండు కారణాలు ఉన్నాయని తెలుపగా వాటిలో మొదటిది దేశాల మధ్య యుద్ధం, రెండవది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పెరిగిన స్థానభ్రంశమని చెప్పింది. ఐక్యరాజ్యసమితి 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్లో ఈ సమాచారాన్ని వెల్లడించింది.

2016లో ప్రపంచ నివేదిక ప్రారంభమైనప్పటి నుంచి ఆకలితో బాధపడుతున్న వారి సంఖ్య ఇదే అత్యధికమని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టొరెరో అన్నారు. ఈ నివేదిక ప్రకారం దక్షిణ సూడాన్, బుర్కినా ఫాసో, సోమాలియా, మాలీలలో వేలాది మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్నారని రిపోర్ట్ తెలిపింది. గాజాలో 11 లక్షల మంది, దక్షిణ సూడాన్‌లో 79 వేల మంది జూలై నాటికి 5వ దశకు చేరుకోవచ్చని అంచనా వేసింది. దీంతో కరువును ఎదుర్కోవాల్సిన దశ కూడా మొదలవుతుందని చెప్పింది. అలాగే 2016లో నమోదైన సంఖ్యతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగిందని తెలిపింది. తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్న వారిలో 80 శాతం మంది అంటే 5,77,000 మంది ఒక్క గాజాలోనే ఉన్నారని ఆర్థికవేత్త చెప్పారు. ఇక్కడ ఆకలి అత్యంత దారుణంగా ఉందన్నారు.

ప్రపంచంలో తీవ్రమైన ఆకలితో బాధపడుతున్న మొదటి 10 దేశాలు

(సంఖ్య దేశం ఆకలితో బాధపడతున్న వ్యక్తులు (మిలియన్లలో)

1. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో 25.8, నైజీరియా 24.8, సుడాన్ 20.2, ఆఫ్ఘనిస్తాన్ 19, ఇథియోపియా 19.7, యెమెన్ 18.0,సిరియా 12.8 బంగ్లాదేశ్ 11.9, పాకిస్తాన్ 11.8, మయన్మార్ 10.6.

బీసీ రిజర్వేషన్ల ఎత్తివేసేందుకు భాజపా కుట్ర

–ఈనెల 5న హైదరాబాదులో బీసీల రాజకీయ మేధో మదన సదస్సు
–బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఓబీసీ రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసిందని అందులో భాగంగానే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు కల్పించలేదని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించకుండా, మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించకుండా చేయడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం బీసీ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు, ప్రస్తుతం జరిగే లోక్ సభ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటున్న బిజెపి అగ్ర నేతలు మోదీ, అమిత్ షా, నడ్డాలు అరవై శాతం జనాభా ఉన్న ఒబీసీలకు భరోసా ఎందుకు కల్పించలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు కులగనన చేయాలని బీసీలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్న బీసీ కులగలను అంశాన్ని కనుమరుగు చేయడానికి కుట్ర చేస్తున్నారని సామాజిక రిజర్వేషన్లను పొమ్మనకుండా భాజాప ప్రభుత్వం పొగ పెడుతుందని జాజుల ఫైర్ అయ్యారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకూర్మ బీసీ నాయకులు వరికుప్పల మధు మహేష్ విూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

తిరుమలలో కుమ్మేసిన వర్షం.. భక్తులకు ఉష్ణతాపం నుంచి ఉపశమనం

తిరుపతి,మే2ఏపిలో ఎండలు మండిపోతున్నాయి. ఎక్కడి చూసినా దాదాపు 45 డిగ్రీల ఉష్ణోగ్రతతో జనాలను ఠారెత్తిస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువై ఉండే తిరుమలలో భారీ వర్షం కురిసింది. భారీ ఎండలతో కొన్ని రోజులుగా అల్లాడిపోతున్న భక్తులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి కూడా తిరుమలలో వాతావరణం కొంత చల్లగానే ఉంది. మధ్యాహ్న సమయానికి వాతావరణం పూర్తిగా మారిపోయి అరగంట సేపు జోరు వాన కురిసింది. ఈ వర్షంతో తిరుమల చల్లగా మారిపోయింది. మరోవైపు, కొండపై భారీ వర్షం కురిసినప్పటికీ కింద తిరుపతిలో వర్షం లేకపోవడం గమనార్హం.

బిఆర్ఎస్‌పై బిజెపి గోబెల్స్ ప్రచారం చేస్తోంది

– మండిపడ్డ బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు

సిద్దిపేట మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బిఆర్ఎస్‌పై బిజెపి గోబెల్స్ ప్రచారం చేస్తోందని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు మండిపడ్డారు. గతంలోనూ దుబ్బాక నుంచి నకిలీ వీడియోలు చేసి వదిలారని, బిజెపి అబద్ధాలు విని, వీడియోలు చూసి ప్రజలు మోసపోవద్దని సూచించారు. దుబ్బాక అసెంబ్లీ ఎన్నికలప్పుడు రఘునందన్ రావు అబద్దాలు చెప్పి గెలిచారని దుయ్యబట్టారు. రఘునందన్ రావు తప్పుడు మాటలు మానుకోవాలని చురకలంటించారు. మెదక్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి హరీష్ రావు ప్రచారం నిర్వహించారు. సిద్దిపేటలోని కోమటి చెరువు సమీపంలో ఉన్న పార్క్ వాకింగ్ వచ్చిన వారితో హరీష్ ముచ్చటించారు. వాకింగ్ అనేది ఆరోగ్యకరమైన అలవాటు అని, వాకింగ్ తో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ప్రజలకు సేవ చేసేందుకు వెంకట్రామిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారన్నారు.

మలబద్ధకం ప్రాణాంతం కావొచ్చు తస్మాత్ జాగ్రత్త

– ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఎమ్. మణిశేఖరన్
– మలద్వారం బైటికి చొచ్చుకొచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడిన యశోద ఆసుపత్రి వైద్యబృందం

ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): నగరంలో స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ మలక్ పేట్ హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ డాక్టర్ ఎమ్.మణశేఖరన్ మాట్లాడుతూ... తీవ్రమైన, దీర్ఘకాలిక మలబద్ధకం మల ద్వారానికి సంబంధించిన అనేక రకాలైన తీవ్రమైన సమస్యల్ని కలగజేయవచ్చు, గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ లాంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీయవచ్చు అని అన్నారు. కొన్ని పరిస్థితుల్లో కేవలం తీవ్రమైన, దీర్ఘకాలికమైన మలబద్ధకం వల్ల తలెత్తే ప్రాణాంతకమైన అనారోగ్య సమస్యల వల్ల రోగి ప్రాణం పోయే పరిస్థితి కూడా తలెత్తచ్చు. నడుము, వీత్తి కడుపు, జననాంగం ప్రాంతాల్లో పట్టేసినట్టుగా ఉండడం, నొప్పి కలగడం, మల విసర్జన సమయంలో తీవ్రమైన అసౌకర్యం కలగడం, నొప్పి కలగడం మలబద్ధకం సాధారణమైన లక్షణాలు మలబద్ధకానికి సకాలంలో సరైన పరిష్కారం కనుగొనకపోతే మలంలో ఉన్న హానికరమైన బ్యాక్టీరియా, విషపదార్థాలు తిరిగి రక్తంలోకి చేరే ప్రమాదం ఉంటుందని తెలిపారు. దానివల్ల సెప్టిసిమియా అనే శరీరం మొత్తం ఇన్ ఫెక్షన్ వ్యాపించి, విషతుల్యమయ్యే పరిస్థితి తలెత్తవచ్చు. మలద్వారం బైటికి చొచ్చుకురావడం, వాయడం, విపరీతంగా రక్తం, చీము కారడం, మూత్ర విసర్జన స్తంభించిపోవడం లాంటి ప్రమాదకరమైన పరిస్థితులకు మలబద్ధకం దారి తీయవచ్చు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్పి ఆగమేఘాల మీద శస్త్ర చికిత్స చేయాల్సిన పరిస్థితి కూడా రావొచ్చని అన్నారు. ఒక్కోసారి ఇలాంటి పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు మలబద్ధకం సమస్యతో బాధపడే వాళు తరచూ గట్టిగా పిట్టం కట్టినట్టుగా ఉండే మలాన్ని విసర్జించడానికి నానా అవస్థలు పడతారు. మల విసర్జన సమయంలో మల ద్వారం చివళ్లు పగిలి తరచూ రక్తం కారుతుంటుంది. మలబద్ధకంతో బాధపడేవారిలో ఎక్కువమంది వంగడానికి, కూర్చోవడానికి, నడవడానికి లేదా లైంగిక సంపర్కానికి కూడా ఇబ్బంది పడుతు ఉంటారు. వయసుతో నిమిత్తం లేకుండా ఈ సమస్య ఎవరికైనా రావచ్చు, కొన్ని అధ్యయనాల ప్రకారం నూటికి 16 శాతం మంది పెద్దలు మలబద్ధకం లక్షణాలు, సమస్యలతో బాధపడుతున్నారని తేలింది. 60 సంవత్సరాలకు పైబడిన వృద్ధుల్లో మూడింట రెండు వందల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి అని అన్నారు. దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నవారిలో 30 నుండి 67 శాతం మందికి మలద్వారం బైటికి చొచ్చుకొస్తుంది. మల విసర్జన సమయంలో పెద్దప్రేగు టిష్యూ బైటికి చొచ్చుకొచ్చి తిరిగి లోపలికి వెళ్లకుండా అలాగే బైటే ఉండిపోతుంది. దీనివల్ల మల విసర్జన మరింత కష్టం అవుతుంది. సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోతే బైటికి చొచ్చుకొచ్చిన మలద్వారం టిష్యూ శ్రీణించడం, కణజాలం చచ్చుబడిపోవడం, సరైన రక్త ప్రసరణ లేక కుళ్లిపోవడం లాంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. వైద్య పరిభాషలో దీన్ని గ్యాంగ్రేస్ అంటారు. దీనికి అత్యవసర శస్త్రచికిత్స చాలా అవసరం అని పేర్కొన్నారు. మలబద్ధ కంతో బాధపడేవారు పేగు టిష్యూ బైటికి చొచ్చుకొస్తున్నట్టు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మల విసర్జన సమయంలో మల ద్వారం చిట్లి రక్తస్రావం కావడం, తరచూ ఆకస్మికంగా తీవ్రమైన కడుపునొప్పి రావడం, ఊహించని రీతిలో శరీరం బరువు తగ్గిపోవడం, గ్యాస్, జ్వరం, వాంతులు, వెన్నునొప్పి, మలద్వారం వాపు, మూత్ర విసర్జన స్తంభించిపోవడం లాంటి లక్షణాలను గమనించగానే రోగి వెంటనే సరైన వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం ఉందన్నారు. మలద్వారం వాచిపోయి విపరీతంగా రక్తస్రావం అవుతూ, మూత్ర విసర్జన పూర్తిగా స్తంభించిపోయిన 60 సంవత్సరాల వృద్ధుడిని అతని బంధువులు హైదరాబాద్ మలక్ పేటలోని యశోద ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆ రోగి దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నాడు. 4 నెలలుగా మలద్వారం బైటికి చొచ్చుకొచ్చి వాచిపోయి రక్తస్రావం అవుతున్న స్థితిలో తను విపరీతంగా బరువు తగ్గిపోయాడు. ఆసుపత్రికి వచ్చేనాటికి 3 రోజులనుండి బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారం వల్ల తీవ్రమైన నొప్పిని అనుభవిస్తూ మల విసర్జన చేయలేకపోతున్నాడు. ప్రేగులో మలం పెద్దఎత్తున పేరుకుపోయి మూత్రాశయాన్ని నొక్కేయడంతో మూత్ర విసర్జన కూడా స్తంభించిపో యింది. వైద్య పరీక్షల్లో ఆ రోగికి మలద్వారం తీవ్రస్థాయిలో బైటికి చొచ్చుకొచ్చి వాచినట్టుగా తేలింది. దాదాపు 15 సెంటీమీటర్ల మేర బైటికి చొచ్చుకొచ్చిన మలద్వారం విపరీతం గా వాచిపోయి తీవ్ర స్థాయిలో మంటపుడుతోంది. మల విసర్జన చేయలేని స్థితిలో లోపల పేగులో పెద్ద ఎత్తున మలం పేరుకుపోవడంవల్ల మూత్రాశయం బాగా ఒత్తుకుపోయి అతనికి మూత్ర విసర్జన కూడా స్తంభించిపోయింది. అలాంటి స్థితిలో యశోద ఆసుపత్రి వైద్య బృందంతో ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఎం.మణిశేఖరన్ అత్యవసర శస్త్ర చికిత్స చేసి, బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారాన్ని కత్తిరించి, కుట్లువేసి రోగి ప్రాణాలను కాపాడారు. యూరాలజిస్ట్ సిస్టోస్కోపీ చేసి బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారం స్థితిని పరిశీలించారు. వారం రోజుల తర్వాత ల్యాప్రోస్కోపిక్ విధానంలో మెష్ రెక్టోపెక్సీ చేశారు. తర్వాత 3 నెలలపాటు రోగిని పరిశీలించిన వైద్యులు తర్వాత థెరిచ్ వైర్ ని తొలగించారు. ఆ తర్వాత రోగి ఎలాంటి అనారోగ్యపరమైన సమస్యలూ లేకుండా మల బద్ధకం సమస్య నుండి, మూత్ర విసర్జన స్తంభన సమస్య నుండి పూర్తిగా కోలుకున్నాడు అని తెలిపారు. నిపుణులైన యశోద ఆసుపత్రి వైద్య బృందం సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు, యశోద ఆసుపత్రి అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి అత్యాధునికమైన వైద్య సేవలకు ఈ కేసు కూడా మరో చక్కటి ఉదాహరణ అని అన్నారు. హైదరాబాద్ మలక్ పేట యశోద ఆసుపత్రిలో మాత్రమే కాక యశోద అసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోద వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ చిదుర తెలిపారు. మరిన్ని వివరాలకోసం ఈ క్రింది నెంబర్లను ఎ.వాసుకిరణ్ రెడ్డిని 9705771230/ 9949998378 సంప్రదించగలరని అన్నారు . ఈ కార్యక్రమంలో పేషంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంపై ఏపీ సీఈఓ ముకేష్ కుమార్ మీనా తీవ్ర ఆగ్రహం

అమరావతి మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్) ఏపీలో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఎన్నికల సంఘం పలు నిబంధనలను విధించిన విషయం తెలిసిందే. కాగా.. పలుమార్లు ఎన్నికల నియమాలను అధికార వైసీపీ తుంగలో తొక్కుతోంది. అయితే ఈ విషయం ఏపీ సీఈఓ ముకేష్ కుమార్ మీనా దృష్టికి రావడంతో ఆయన జగన్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు ఏపీ సీఈఓ మీనా మీడియా సమావేశంలో పలు కీలక విషయాలను పంచుకున్నారు. ప్రభుత్వ సింబల్‌ను కొన్ని ప్రకటనల్లో వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈసీ పర్మిషన్ కోసం వచ్చినప్పుడు బ్లర్ చేసే చూపారని చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వ సింబల్ ఉన్న ప్రకటలను తొలగించాలని సూచించామని ఏపీ సీఈఓ మీనా తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లపై సీఈఓ మీనా కీలక సూచనలు చేశారు. ఏపీ ఎన్నికల్లో మొత్తంగా 4.14 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని సీఈఓ మీనా తెలిపారు. ఫైనల్ ఎస్ఎస్ఆర్ కంటే తుది ఓటర్ల జాబితాలో 5.94 లక్షల మంది ఓటర్లు పెరిగారని తెలిపారు. గురువారం మీడియాతో ఏపీ సీఈఓ మీనా మాట్లాడుతూ.. ఏపీలో మొత్తం 46,389 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు రూ. 203 కోట్ల సీజ్ చేశామన్నారు. నగదుతో సహా మద్యం, గంజాయి, విలువైన ఆభరణాలను సీజ్ చేశామని చెప్పారు. 14 సెగ్మెంట్లల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ పెడుతున్నామన్నారు. అలాగే ఈ 14 సెగ్మెంట్లల్లో భద్రత కూడా పెంచుతామని చెప్పుకొచ్చారు. ఓటర్లకు ఎండతో ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. హోం ఓటింగ్ కోసం కేవలం 28,591 మంది మాత్రమే ఎంచుకున్నారని వివరించారు. మొత్తంగా 7,28,484 మంది హోం ఓటర్లు ఉంటే కేవలం 3 శాతం మాత్రమే హోం ఓటింగ్ కోరుకున్నారని తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియ ఈరోజు నుంచే ప్రారంభమైంది.. ఈ నెల 8వ తేదీతో పూర్తి అవుతుందని చెప్పారు. 8తేదీలోగానే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు గాజు గ్లాస్ గుర్తును మొత్తంగా 15 చోట్ల మార్చినట్లు తెలిపారు. ఆ 15 స్థానాల్లో స్వతంత్రులకు వేరే గుర్తులు కేటాయించినట్లు వివరించారు. విశాఖలో పార్లమెంట్ పరిధిలో మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతున్నాయని చెప్పారు. మంగళగిరి, తిరుపతి సెగ్మెంట్లల్లో మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతున్నాయన్నారు. 15 వేల బ్యాలెట్ యూనిట్లను అదనంగా తెప్పించినట్లు చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలీస్ అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఎవరికైనా భద్రత కల్పించాల్సిన అవసరం ఉంటే సెక్యూరిటీ ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. 374 మంది అసెంబ్లీ అభ్యర్థులకు.. 64 మంది పార్లమెంట్ అభ్యర్థులకు భద్రత కల్పించాలని పోలీస్ అబ్జర్వర్లు సూచించారని అన్నారు. ఈ ఎన్నికల్లో 1.60 లక్షల బ్యాలెట్ యూనిట్లను వాడుతున్నామన్నారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్లు ఎంత మేరకు వచ్చాయనేది ఇంకా ఫైనల్ కాలేదన్నారు. ఎన్నికల విధుల్లో 3.30 లక్షల మంది ఉన్నారని తెలిపారు. గోవా, హర్యానా, యానాం, తెలంగాణ నుంచి లిక్కర్ వస్తోందన్నారు. గోవా, హర్యానా డీజీపీలతో తాము మాట్లాడామన్నారు. లిక్కర్ డంప్ , సరఫరా వెనుక ఒకరిద్దున్నారని తెలిసిందన్నారు. ప్రతి జిల్లాలో ఎఫ్ఎస్టీ టీంలు ఉన్నాయన్నారు. మద్యం అక్రమాలను అరికడుతున్నామని ఏపీ సీఈఓ మీనా పేర్కొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు

–మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం

విశాఖపట్నం, మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ఎటువంటి సందేహాలు వద్దని.. జిరాక్స్ పేపర్లు ఇస్తారు అనేది అబద్ధమన్నారు. భూ హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా యాక్ట్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. దళారి వ్యవస్థ ఉండకూడదని యాక్ట్ తెస్తున్నామని చెప్పారు. ఎన్నికలు కోడ్ లేకపోతే తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోనేవారవన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సలహాలు, సూచనలు ఇచ్చిందన్నారు. ప్రజల ఆస్తులను మరింత రక్షణ కల్పించాలనేది సీఎం జగన్ ఆలోచన అని చెప్పుకొచ్చారు. వైసీపీ పథకాలను, మేనిఫెస్టో పేజీలను చంద్రబాబు కాపీ కొట్టారని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టో చెత్త బుట్టలో వేయడానికి తప్ప దేనికి పనికి రాదన్నారు. ఎన్డీయే మేనిఫెస్టోపై మోదీ, పురందేశ్వరి బొమ్మలు ఏవి అని ప్రశ్నించారు. కూటమి పార్టీలే మేనిఫెస్టోను అంగీకరించనప్పుడు రాష్ట్ర ప్రజలు ఎందుకు ఆమోదించాలన్నారు. మంచి పని చేస్తున్న సీఎం జగన్ ఫోటో సర్వే రాళ్ళ మీద వేస్తే తప్పేంటి? అని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు.

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, మే2: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్(ఓఎం ఎజీశ్రీజీబజీనితి) అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.నివేదిత, బోర్డు మాజీ సభ్యులు, ముఖ్య నేతలతో ఎన్నికల ప్రచార సరళిపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే సాయన్నకు 30 ఏళ్ల అనుబంధం ఉందని, నియోజకవర్గ ప్రజలందరూ సాయన్న కుటుంబ సభ్యులేనని తెలిపారు. సాయన్న బిడ్డ నివేదితకు ప్రజలందరూ బ్రహ్మారథం పడుతున్నారని, ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఏడాది కాలంలోనే తండ్రిని, చెల్లిని కోల్పోయిన అభ్యర్థి నివేదితకు ప్రజలందరూ దీవెనలు అందించాలని కోరారు.

నాటి సీఎం కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కంటోన్మెంట్‌లో సాయన్న ఎన్నో అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఏరియా రక్షణ శాఖ ఆధీనంలో ఉన్నప్పటికి సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యేలా చొరవ చూపారని గుర్తు చేశారు. సాయన్న బిడ్డ నివేదితను కడుపులో పెట్టుకొని కాపాడుకోవల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. అలాగే మల్కాజ్‌గిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థులిద్దరు నాన్ లోకల్ అని, లోకల్ అయిన రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమన్నారు

ఏపీలో 46,389 పోలింగ్ కేంద్రాలు.. ఓటర్ల వివరాలివే : సీఈఓ

అమరావతి, మే2ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లకు సంబంధించిన వివరాలను ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా గురువారం వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 4.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 65,707 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.

ఇక ఈ ఎన్నికల కోసం మొత్తం 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ముఖేశ్ కుమార్ మీనా వివరించారు. ఒక్కో కేంద్రంలో 1500 మంది ఓట్లు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్య అంతకంటే పెరిగినప్పుడు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని. 224 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల కోసం ఈసీకి ప్రతిపాదనలు పంపామన్నారు.

64 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్..

రాష్ట్రంలో 12,438 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో 64 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఉంటుందన్నారు. 14 నియోజకవర్గాల్లో పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని పర్యవేక్షకుల నుంచి సిఫార్సులు అందాయన్నారు.

ఇందులో మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, ఒంగోలు, ఆళ్లగడ్డ, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, పీలేరు, విజయవాడ సెంట్రల్, పలమనేరు, రాయచోటి, తంబళ్లపల్లి శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. ఇక, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని.. పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ కిట్ లు కూడా ఏర్పాటు చేస్తున్నామని, నీడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు.

అన్యాయాన్ని ఎదుర్కొనలేకపోతే భవిష్యత్ అంధకారం : పవన్ కల్యాణ్

అమరావతి, మే2 వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనలేకపోతే భవిష్యత్ అంధకారమవుతుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. మన్యం జిల్లా పాలకొండలో నిర్వహించిన వారాహి విజయయాత్ర సభలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

కూటమి కి ఓటు వేయాలని అడగడం లేదని కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్తిస్తున్నానని, రాబోయేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. పంచాయతీలకు కేంద్ర నిధులు అందించే బాధ్యత తీసుకుంటామని అన్నారు. సీపీఎస్ సమస్యకు ఏడాదిలోపు పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి తనవంతుగా రూ. కోటీ విరాళం ఇస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. పాలకొండ నియోజకవర్గాన్ని బంగారు కొండగా మార్చే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు.

పాము కాటుతో యువకుడు మృతి.. విషం విరుగుడు కోసం గంగా నదిలో మృతదేహం ఉంచిన వైనం

లక్నో, మే2: పాము కాటు వల్ల ఒక యువకుడు మరణించాడు. అయితే ఏదైనా అద్భుతం జరుగుతుందని కుటుంబ సభ్యులు భావించారు. విషం విరుగుతుందన్న మూఢనమ్మకంతో తాళ్లతో కట్టిన మృతదేహాన్ని గంగా నదిలో ఉంచారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జైరాంపూర్ కుడేనా గ్రామానికి చెందిన 20 ఏళ్ల మోహిత్ కుమార్ బీకామ్ చివరి ఏడాది చదువుతున్నాడు. ఈ నెల 4న తుది పరీక్షలు రాయాల్సి ఉంది.

కాగా, ఏప్రిల్ 26న పార్క్‌కు వెళ్లిన మోహిత్ కుమార్‌ను పాము కాటు వేసింది. వాంతి కావడంతో ఇంటికి చేరుకున్న అతడు కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు ఆశ వదులుకోలేదు. పాము విషం విరుగుడు చేసేవారి వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లగా అతడు చనిపోయినట్లు వారు చెప్పారు.

మరోవైపు గంగా నదిలో మృతదేహాన్ని ఉంచితే విషం తొలగి మోహిత్ బతుకవచ్చని కుటుంబ సభ్యులు భావించారు. ఈ మూఢనమ్మకంతో తాళ్లతో కట్టిన మృతదేహాన్ని గంగా నదిలో ఉంచారు. ఇది చూసేందుకు స్థానికులు గుమిగూడారు. అయితే ఎలాంటి ఫలితం లేకపోవడంతో చివరకు మోహిత్ మృతదేహానికి గంగా ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

అన్యాయాన్ని ఎదుర్కొనలేకపోతే భవిష్యత్ అంధకారం : పవన్ కల్యాణ్

అమరావతి, మే2 వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనలేకపోతే భవిష్యత్ అంధకారమవుతుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ అన్నారు. మన్యం జిల్లా పాలకొండలో నిర్వహించిన వారాహి విజయయాత్ర సభలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

కూటమి కి ఓటు వేయాలని అడగడం లేదని కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్తిస్తున్నానని, రాబోయేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. పంచాయతీలకు కేంద్ర నిధులు అందించే బాధ్యత తీసుకుంటా మని అన్నారు. సీపీఎస్ సమస్యకు ఏడాది లోపు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి తనవంతుగా రూ. కోటీ విరాళం ఇస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. పాలకొండ నియోజకవర్గాన్ని బంగారు కొండగా మార్చే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు.

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరు అడ్డుకోలేరు : పద్మారావు గౌడ్

హైదరాబాద్, మే2:కాంగ్రెస్ ప్రభుత్వం మోసకారి ప్రభుత్వం అని, ఆరు గ్యారంటీలని చెప్పి ఒక్క గ్యారంటీ అమలు చేయలేకపోయిందని బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావు గౌడ్‌అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్లేపల్లిలో ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్‌రావు, నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికలు రాగానే ఏ పార్టీలో ఉంటాడో కూడా తెలియదని విమర్శిం చారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

కేసీఆర్‌ను మార్గదర్శకంగా తీసుకుని ప్రజా సేవలో తాము ఎల్లప్పుడు ముందుంటామని హామీనిచ్చారు. మైనార్టీల కోసం చేసిన సంక్షేమాన్ని గుర్తించి నాంపల్లి నియోజకవర్గం ప్రజలు తనకు అత్యధిక మెజార్టీని అందించాలని పద్మారావు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజయ్, బాసిత్, అబ్దుల్ కలీం, మమత శ్రీశైలం గౌడ్, అనంతరాములు గౌడ్, ప్రదీప్ కుమార్ అగర్వాల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి.. రేవంత్‌కు పాలనతెలియదు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, మే2: తప్పుడు వాగ్దానాలు చేసి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పాలన ఎలా చేయాలో తెలియదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 'మహిళలని చూడకుండా ఇష్టం వచ్చిన్నట్లు మాట్లాడితే ఖబర్దార్ రేవంత్‌రెడ్డి'.. అని హెచ్చరించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. పట్టించుకోని ముఖ్య మంత్రికి నోరు పారేసుకోవడం అలవాటైందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలాల్లో తిరుగుతూ.. రైతుల కష్టాలు తెలుసు కుంటుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఐపీఎల్ మ్యాచ్‌లు చేస్తున్నారని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల జాబితాను కేసీఆర్ ఇచ్చినా.. న్యాయం చేయలేదన్నారు. బుధవారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో మీర్‌పేట మహిళా విభాగం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు సునీతాబాల్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ సమావేశానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి గులాబీ పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న రేవంత్ రెడ్డి సచివాలయంలో ఎందుకు కూర్చుంటున్నారో చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను, ప్రజలను మోసం చేసిన చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓట్ల ద్వారా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చెప్పాలన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఏ ఒక్కరోజు కూడా నియోజకవర్గంలో తిరగలేదన్నారు. మోదీని, రాముడిని చూసి ఓట్లు వేయమని అడుగుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి ఓట్లు వేస్తే ప్రయోజనం లేదన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు తండోపతండాలుగా తరలివస్తున్న ప్రజలను చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు వణుకు పుడుతున్నదని చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేసీఆర్ పనిచేస్తారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మర్చిపోయి తప్పుడు ప్రచారం చేయడంలో ముందుంటారని విమర్శించారు. ఈ సమావేశంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య , అనిల్ కుమార్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చెప్పుకోలేక.. కాంగ్రెస్ నేతల వ్యక్తిగత ఆరోపణలు.. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మహబూబ్‌నగర్, మే2ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కూడా ఆడబిడ్డనైన తనపై నోటికి వచ్చినట్లు తూలనాడడం భావ్యం కాదని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ మక్తల్ పట్టణంలో నిర్వహించిన రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి గురించి చెప్పుకునే అవకాశం లేక తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మాట్లాడే ముందు కాంగ్రెస్ నాయకులకు అమ్మ ఆలీ చెల్లి అనేవారు లేరా అని తమకు తాము ఆలోచించుకోవాలని బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ఏ పార్టీ అభ్యర్థి అయినా రేపు గెలిపిస్తే ఏ అభివృద్ధి చేస్తారో చెప్పుకుంటారని కానీ కాంగ్రెస్ నాయకులకు ఏం చేయబోతున్నాము ఏం చేశామో చెప్పుకునే అవకాశం లేక తనపై నోటికొచ్చినట్లు దూషణలకు దిగుతున్నారని ఇంత దిగజారుడు రాజకీయం ఎన్నడూ చూడలేదని అన్నారు. పాలమూరు జిల్లాలో మంత్రిగా తాను చేసిన అభివృద్ధి తప్ప పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు.

మక్తల్ నుండి జిల్లా కేంద్రం నారాయణపేట మరో జిల్లా కేంద్రం గద్వాల కు వెళ్లే దుస్థితిలో ఉన్నాయని వాటి గురించి పట్టించుకునే ధ్యాస వారికి లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ ల పేరుతో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు ఉందా అని ఆమె ప్రశ్నించారు. అదే సమయంలో ఐదేళ్లు ఎంపిగా పని చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి చేసింది ఏమీ లేదని ఆ పార్టీకి కూడా ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. దేశ అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని పాలమూరు అభివృద్ధి కోసం తనను ఎంపిగా గెలిపించాల్సిందిగా డీకే అరుణమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య మున్సిపల్ చైర్ పర్సన్ బాల్చేడ్ పావని మల్లికార్జున్, వైస్ చైర్పర్సన్ బి. అఖిల రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, కర్ని లక్ష్మి స్వామి, ఈసారి కౌసల్య నాగప్ప, కోల్వూర్ కొండయ్య, నాయకులు కర్ని స్వామి, దేవరింటి నరసింహారెడ్డి ,బి. రాజశేఖర్ రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, జి. బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి పూజలు

ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): నగరంలోని గాంధీ చౌక్ ప్రాంతంలోని కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేదాశీర్వాదం పొందారు. అనంతరం ఆర్యవైశ్య సమ్మేళనం లో మాట్లాడారు. అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యాపార రంగానికి అండగా ఉంటామని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణ కుమారీ, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్, మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు కొప్పుల చంద్ర శేఖర్, ఆలయ నిర్వాహకులు మేళ్ళ చెర్వు వెంకటేశ్వర రావు, గోళ్ల భాస్కర్ రావు, బీసీసి.రావు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్,బీజేపీని ఏడు కండేల లోతులో పాతేద్దాం

–కుట్రలు ఒకరివి,మత విద్వేషాలు మరొకరివి

–దమ్మాయి గూడెం ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి

ఖమ్మం, మే2(నేటినిజం ప్రతినిధి): ఈ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజే పీలను ఏడు కనీడేల లోతులో పాతిపెడదామనీ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మాయ మాటలు చెబుతూ.. బీ ఆర్ఎస్ఎస్ పదేళ్లు కాలం వెళ్లదీసింది అని అన్నారు. అప్పుడు దోచుకొని, అంతా దాచుకొని ఇప్పుడు తమ సర్కారు పై కే సీఆర్ విమర్శలు చేస్తున్నాడు అని న్నారు. ప్రాజెక్టుల పేరుతో ఖజానా అంతా తన ఇంట్లోకి పంపుకున్నాడు అని ఆరోపించారు. నాగార్జున సాగర్ నీటిని ప్రక్క రాష్ట్రానికి తరలించి రైతుల పంటలు ఎండేలా చేశాడని అన్నారు. బస్సు యాత్ర పేరిట కర్ర పట్టుకొని తిరుగుతూ.. కళ్లబొల్లి మాటలు చెబుతున్నాడు అని అన్నారు. మిషన్ భగీరథ పథకం లో భారీ అవినీతికి పాల్పడ్డాడు అని తెలిపారు. అప్పుడు యూనిట్ విద్యుత్ ను పక్క రాష్ట్రాల నుంచి రూ. 20కు పైనే పెట్టి కొని..సొమ్ము దోచుకున్నారు అని, తమ సర్కారు రూ. 3.50 కే కొంటోంది అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ఏ పల్లె లో కూడా మంచినీటి సమస్య రానియ్యమని మంత్రి పొంగులేటి అన్నారు.

– బీజేపీతో దోస్తీ కట్టిన బీఆర్ఎస్..

కేంద్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు పరిశ్రమను విస్మరించింది అని, అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఒత్తిడి తేలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రశ్నిస్తే జైలుకి పోతాడనే భయం ఆయనలో ఉంది అని అన్నారు. పగలేమో విమర్శలు, రాత్రి కేమో బీజేపీ తో మంతనాలు చేస్తుంటారు అని ఆరోపించారు.

ఖమ్మం సభలో నామాను గెలిపిస్తే కేంద్రంలో మంత్రిని చేస్తానని కేసీఆర్ అన్నారని, తద్వారా వారి రహస్య స్నేహం బట్టబయలు అయిందని చెప్పారు. అధికారంలోకి వస్తే హిందువుల మంగళసూత్రాలు ముస్లింలకు ఇస్తారని బీ జేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని, మత విద్వేషాలు రెచ్చగొడుతోంది అని తెలిపారు. ప్రజా సేవ కోసం పోటీ చేసిన రఘురామ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

– అందరి సమన్వయంతో పనిచేస్తా: రఘురాం రెడ్డి

ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి, రాజ్య సభ సభ్యురాలి

– రఘురాంరెడ్డితో కలిసి ప్రచారం

సమన్వయంతో అభివృద్ధికి పాటు పడతా అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయనీ రఘు రాం రెడ్డి అన్నారు. దొంగ మాటలు చెప్పే బీ ఆర్ఎస్, బీజేపీ లను నమ్మొద్దు అని కోరారు. మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ కు పరామర్శ... తిరుమలాయపాలెం లో మాజీ ఎం పీపీ కొప్పుల అశోక్ నివాసానికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం వెళ్లి ఆయన ను పరామర్శించారు. జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో.. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, నాయకులు రామ సహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ఎంపీపీ మంగీలాల్, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని అన్ని డివిజన్లలో విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ డోర్ టు డోర్ ప్రచారం

-ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్న వెలిచాల రాజేందర్ రావు కూతుళ్ళు

-రాజేందర్ రావు గెలుపు ఖాయం

-సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ నేటి నిజం ప్రతినిధి నగరంలో అన్ని డివిజన్లలో విస్తృతంగా డోర్ టు డోర్ ప్రచారం జరుగుతుందని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. అందరు ముఖ్య నాయకులు తమ తమ డివిజన్లలో పాల్గొంటున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కూతుళ్ళు లయంలో రాజేందర్ రావు కూతుళు రచన,రితిక, స్నేహ ప్రతి రోజు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రచారంలో చురుకుగా పాల్గొంటూ డివిజన్ బాధ్యుడు మామిడి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఏవిధంగా ప్రజలు సంక్షేమ పథకాలు పొందు తారో ఇంటిటికి వెళ్లి వివరిస్తున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. చైతన్యపురిలో ప్రచారం చేస్తూ మహాశక్తి దేవా కుమార్,బషీర్ తదితులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లో చేరిన బీజేపీ నేత ఏదులపురం లక్ష్మీనారాయణ

కరీంనగర్, మే2 (నేటినిజం ప్రతినిధి) మాల్యాల మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ కార్యదర్శి ఏదులపురం లక్ష్మీనారాయణ కరీంనగర్ లోని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్ గెలుపు కోసం సైనికుడిలా పని చేస్తానని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో బండి సంజయ్ నయాపైసా అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు.

సమాజం కోసం తపించిన మహనీయుడు , విద్యాదాత, స్ఫూర్తి ప్రదాత రాజ బహద్దూర్ వెంకటరాంరెడ్డి

-బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి..

కరీంనగర్, మే2 (నేటినిజం ప్రతినిధి) సమాజం కోసం తపించిన మహనీయుడు, విద్యాదాత, స్ఫూర్తి ప్రదాత రాజబహద్దూర్ వెంకట రాంరెడ్డి అని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు . రాజా బహదూర్ వెంకటరామరెడ్డి 71 వర్ధంతి సందర్భంగా ఆర్ బి వి ఆర్ ఆర్ కూడలిలో జరిగిన వర్ధంతి వేడుకల్లో గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం లో మెరుగైన మార్పు సాధ్యమని , సొంత నిధులతో విద్యా సంస్థలు నెలకొల్పి ఎందరికో విద్యాప్రదాతగా నిలిచిన మహోనుభావుడు రాజబహద్దూర్ వెంకటరా ంరెడ్డి అని అన్నారు. జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన నిరాడంబర వ్యక్తి, ఈ తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. హైదరాబాద్ లో శాంతి సామరస్యాన్ని పెంపొందించిన గొప్ప అధికారి గా వెంకటరాంరెడ్డి కి పేరుందని, ఆయన కృషి మరవలేనిదన్నారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి విద్య కోసం వచ్చిన ఎంతోమందికి ఆశ్రయం కల్పించారన్నారు. . నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో నాయకత్వం వహించిన చాలామంది, రెడ్డి హాస్టల్ లో ఉండి విద్యను అభ్యసించిన వారే న్నారు. సాయుధ పోరాట నాయకుడు రావి నారాయణరెడ్డి నుంచి పూర్వ ప్రధానమంత్రి పీవీ నరసింహా రావు వరకు ఎంతో మంది మహనీయులు రెడ్డి హాస్టల్ లో ఉండి చదువుకున్నారని, . వెంకటరాంరెడ్డి సంపాదించిన ప్రతిపైసా పేదల కోసమే వెచ్చించారన్నారు. సంఘసేవకునిగా, విద్యాదాతగా, కులమతాలకు అతీతంగా విశేష సేవలు అందించిన వెంకటరాంరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ మహనీయుడు రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి చరిత్రను రజాకార్ లు మరుగున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జె ఈ ఈ మెయిన్ అల్ ఇండియా 27 ర్యాంకు సాధించిన చిగురుమామిడి మండలం లంబాడి పల్లి గ్రామానికి చెందిన సంపత్ రెడ్డి కుమార్తె పింగళి వెన్నెల రెడ్డి ని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా సన్మానించారు .

పార్లమెంటు ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలి

– బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

–పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

కరీంనగర్, మే 2: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నగర ప్రజలు అభివృద్ధి వైపు ఉంటారో, విధ్వంసం వైపు ఉంటారో ఆలోచించుకోవాలని, పార్లమెంటు ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలని బిఆర్ ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో కలిసి బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ మార్నింగ్ వాక్ లో పాల్గొని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఏనాడైనా ప్రధానమంత్రి మోడీ , కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి కరీంనగర్ అభివృద్ధి గురించి నిధులు అడగలేదని విమర్శించారు. కులం, మతం ...ధర్మమంటూ యువతను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందడం తప్ప బండి సంజయ్ కి అభివృద్ధి సంక్షేమం పట్ల ధ్యాస లేదని అన్నారు.. 2014-2019లో తాను ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికీ కరీంనగర్ అభివృద్ధికి చాలాసార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి నిధులు తెచ్చాను అని గుర్తు చేశారు.. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన ఐదేళ్ల కాలంలో ఒక్క మున్సిపల్ సమావేశానికి గాని, జిల్లా పరిషత్ సమావేశానికి కానీ హాజరు కాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలు పట్టించుకోని బండి సంజయ్ కి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. కరీంనగర్ పార్లమెంటుకు తాను ఐదేళ్లు ఎంపీగా ఉన్నానని, బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా పనిచేశారని ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ప్రజలు బేరీజు వేసుకోవాలని అన్నారు.. నగర ప్రజలు అభివృద్ధికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు..

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడుగా బి వినోద్ కుమార్ ఉన్నప్పుడు నగర ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్ చేసుకోవాలని ఆలోచనతో ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారని భాగంగా జ్యోతిబా పూలే మైదానాన్ని – ఆర్ట్స్ కాలేజ్ మైదానాలను పార్కులుగా తీర్చిదిద్దారని.. వాటిలో, చిల్డ్రన్ పార్కు వాకింగ్ ట్రాకులు, సింథటిక్ ట్రాకులు ఏర్పాటు చేసి నగర ప్రజలకు అందుబాటులో తెచ్చారని... జ్యోతిబాపూలే పార్కు పనులు పూర్తయ్యాయని.. ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో పనులు తుది దశకు వచ్చాయని.. రెండు పార్కుల్లో ఉదయం సాయంత్రం కలిపి సుమారు 700 మంది వాకర్స్ వాకింగ్ చేస్తున్నారని అన్నారు.. కరీంనగర్ లో బిఆర్ఎస్ ప్రభుత్వంహయాంలో అద్భుతంగా అభివృద్ధి జరిగిందని ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని అన్నారు.. వినోద్ కుమార్ చొరవతో స్మార్ట్ సిటీ సాధించి నిధులు తీసుకురావడం వల్లనే కరీంనగర్ అద్భుతంగా అభివృద్ధి జరిగిందని.. అన్నారు.. కరీంనగర్ లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని.. జరిగిన అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమం లో నగర మేయర్ వై సునీల్ రావు , కార్పొరేటర్ వాల రమణారావు, కంసాల శ్రీనివాస్, నాయకులు గందె మహేష్, గూడూరు మురళి,ఆది మల్లేశం, దూలం సంపత్ గౌడ్, కర్ర సూర్య శేఖర్ వరప్రసాద్ పటేల్ ,కరీం , పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు...

కర్ణాటకలో మోస పూరిత పాలన జరుగుతుంది...

–ఓటర్లంతా బీజేపీ ని ఆదరించండి.

మానకొండూర్ అసెంబ్లీ ప్రవాసి ప్రభారీ ఆర్. మారుతి.

కరీంనగర్, మే2 (నేటినిజం ప్రతినిధి) కర్ణాటక లో గ్యారంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వల్ల మోస పూరిత పాలన జరుగుతుందని కర్ణాటక రాష్ట్ర బీజేపీ నాయకులు, మానకొండూర్ అసెంబ్లీ ప్రవాసి ప్రభారీ ఆర్ మారుతి ఆరోపించారు.జాతీయ పార్టీ సూచనల మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధి పర్యటన సందర్భంగా బుధవారం మండలంలోని రేణికుంట, గొల్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని కార్యకర్తలను కలిసి ఓటర్లను మాట్లాడి బీజేపీ కే ఓటయ్యాలని అభ్యర్థించారు.బూత్ స్థాయిలో బీజేపీ సంస్థాగత నిర్మాణం విషయంలో కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు.కర్ణాటక లో మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైపల్యాలను తెలంగాణ ప్రజలు తెలపాలని కోరారు.మరోసారి ప్రధాని గా నరేంద్ర మోడీ నే ఉండాలని దేశ వ్యాప్తంగా ప్రజలంతా కోరుతున్నారని పేర్కొన్నారు.బీజేపీ తోనే ప్రజలకు అవినీతి లేని పాలన ఉంటుందని అన్నారు.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీ ని ఆదరించాలని కోరారు.కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి గా పోటీ చేస్తున్న బండి సంజయ్ ను అత్యధిక మెజారిటీ తో గెలిపించి,మోదీ సంకల్పించిన 400 ఎంపీ సీట్లలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయా గ్రామాలలో ప్రచారం నిర్వహించి, వివిధ పార్టీలకు సంబందించిన ముఖ్య నాయకులతో పాటుగా కీలకమైన వ్యక్తులతో కలిసి ముచ్చటించారు.మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, కో కన్వీనర్ బత్తిని స్వామి,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,నావికాదళ మాజీ ఉద్యోగి మేడిపల్లి జనార్దన్ రెడ్డి, బూత్ అధ్యక్షులు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఈ వేసవిలో చింపిరి జుట్టు గురించి ఆందోళన చెందుతున్నారా?

మృదువైన, పోషకయుక్తమైన జుట్టు కోసం DIY హెయిర్ మాస్‌ని ప్రయత్నించండి

న్యూఢిల్లీ, మే2 వేసవి ప్రారంభమైనందున, యూవీ కిరణాలు, తేమ, కాలుష్యంల హానికరమైన ప్రభావాల నుండి మీ జుట్టు ను రక్షించే శిరోజ సంరక్షణ దినచర్యను క్రమం తప్పకుండా అనుసరించడం చాలా ముఖ్యం. ఈ కాలుష్య కారకాల కలయిక తరచుగా నిస్తేజంగా, పొడిగా ఉండే, చింపిరి జుట్టుకు దారితీస్తుంది. అంతేకాకుండా, కఠిన జలాల (హార్డ్ వాటర్)కు ఎక్కువగా గురి కావడం వల్ల నష్టం మరింత తీవ్రమవుతుంది. అది మీ జుట్టును నిస్తేజంగా, చిట్లి పోయేలా చేస్తుంది. చింపిరిని నియంత్రించడానికి, మీ జుట్టుకు చక్కటి పోషణను అందించడానికి ఒక ప్రభావవంతమైన మార్గం ఒక సాధారణ హెయిర్ ఆయిల్ రొటీన్‌లో పాల్గొనడం. ఎంచుకోవడానికి అనేక హెయిర్ ఆయిల్ ఎంపికలు ఉన్నప్పటికీ, మీరు మీ జుట్టుకు సరైన పదార్థాలతో ఒకదాన్ని ఎంచుకోవాలి. కలబంద చాలా సంవత్సరా లుగా వేసవిలో ఇష్టపడే వాటిలో ఒకటి!అలోవేరాతో కూడిన కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ విశిష్ట మిశ్రమం మీ శిరోజాల్లోకి పది పొరల దాకా చొచ్చుకుపోతుంది. జుట్టు చింపిరి కాకుండా తోడ్పడుతుంది. శిరోజ వృద్ధిని పెంచడం, జుట్టు పలచన అయ్యేం దుకు దారి తీసే హెయిర్ ఫాల్ (వెంట్రుకలు రాలిపోవడం)ను నిరోధించేందుకు, మొత్తం మీద వేసవి కాలం లో శిరోజ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అలోవేరా ఒక గొప్ప దినుసుగా పేరొందింది. అంతేగా కుండా అలోవేరా విటమిన్లు, మినరల్స్ కు బాగా పేరొందింది. అది మాడుకు, జుట్టుకు పోషణను అందిస్తుంది. శిరోజాలను పటిష్ఠం చేస్తుంది. అవి చిట్లిపోకుండా చూస్తుంది. మాడు గోకుడుపెట్టకుండా చేస్తుంది. చుండ్రును కూడా తగ్గిస్తుంది.

నెక్సస్ హైదరాబాద్ మాల్లో ఆర్మీ బూట్ క్యాంప్

హైదరాబాద్, మే2: నెక్సస్ హైదరాబాద్ మాల్ పద్దెనిమిది ఏళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేకంగా ఆర్మీ బూట్ క్యాంప్‌ను ప్రారంభించింది. ఈ క్యాంప్ ఈనెల 31వ తేదీ వరకు ఉండనుంది. దీనిని యువ రిక్రూట్‌ల కోసం సాహసంతో కూడిన ప్రయాణంగా చెప్పవచ్చు. ఈ క్యాంప్ ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది వరకు ఉంటుంది. ఆర్మీ బూట్ క్యాంప్ పాల్గొనేవారిలో జట్టుకృషి, స్థితిస్థాపకత, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో థ్రిల్లింగ్ కార్యకలాపాలను అందిస్తుంది. రాక్ క్లైంబింగ్ నుంచి ఆర్మ్ రెజ్లింగ్ వరకు, రైఫిల్ షూటింగ్ నుంచి టన్నెల్ క్రాలర్ ద్వారా నావిగేట్ చేయడం వరకు ఉంటుంది. నిజ జీవితంలో సైనిక శిక్షణ సవాళ్లు ఉత్సాహాన్ని అనుసరించేలా రూపొందించబడింది. ఈ ఆర్మీ బూట్ క్యాంప్‌కు హాజరు కావాలనుకునే వారు టికెట్లు తీసుకోవాల్సి ఉంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు పిల్లలకు రూ. 199, శని, ఆదివారాలు, పబ్లిక్ సెలవుల్లో ఒక్కొక్కరిక రూ. 299 టికెట్ ధరలు ఉన్నాయి. అయితే, ప్రత్యేక ఆఫర్ కింద రూ. 5,000 షాపింగ్ చేయడం ద్వారా ఒకరికి ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. శని, ఆదివారాల్లో సైనిక శిక్షణ, వ్యూహాలకు సంబంధించి వివిధ అంశాలపై మధ్యాహ్నం మూడున్నర నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు ప్రత్యేకమైన వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది.

బీసీ రిజర్వేషన్ల ఎత్తివేసేందుకు భాజపా కుట్ర

–ఈనెల 5న హైదరాబాదులో బీసీల రాజకీయ మేధో మదన సదస్సు

– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ మే 2 (దక్షిణాది న్యూ స్); ఓబీసీ రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసిందని అందులో భాగంగానే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు కల్పించలేదని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించకుండా, మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించకుండా చేయడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.గురువారం బీసీ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు, ప్రస్తుతం జరిగే లోక్ సభ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటున్న బిజెపి అగ్ర నేతలు మోదీ, అమిత్ షా, నడ్డాలు అరవై శాతం జనాభా ఉన్న ఒబీసీలకు భరోసా ఎందుకు కల్పించలేక పోతున్నారని ఆయన ప్రశ్నించారు కులగనన చేయాలని బీసీలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్న బీసీ కులగలను అంశాన్ని కనుమరుగు చేయడానికి కుట్ర చేస్తున్నారని సామాజిక రిజర్వేషన్లను పొమ్మనకుండా భాజాప ప్రభుత్వం పొగ పెడుతుందని జాజుల పైర్ అయ్యారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షులు కుల్చచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకూర్మ బీసీ నాయకులు వరికుప్పల మధు మహేష్ మీరు భాన్కర్ తదితరులు పాల్గొన్నారు

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు , మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు తెచ్చింది బిజెపి...

–పదేళ్లలో రిజర్వేషన్లు ఇచ్చిన బిజెపి , ఇప్పుడు రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేస్తుంది...

– బిజెపి జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు

కరీంనగర్, మే2 (నేటినిజం ప్రతినిధి) అగ్రవర్ణాల పేదలకు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చిన బిజెపిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని , నేడు బిజెపి రిజర్వేషన్లు రద్దు చేస్తుందని పనికిమాలిన రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బాన సత్యనారాయణ మండిపడ్డారు. గురువారం కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడి చి , దేశంలో ఎమర్జెన్సీ విధించి చీకటి రోజులు తెచ్చిన చరిత్ర కాంగ్రెస్ కే ఉందన్నారు. అంబేద్కర్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడగొట్టిన చరిత్ర కూడా కాంగ్రెస్ దేనన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంపై , రిజర్వేషన్ ల పై కాంగ్రెస్ కు గౌరవం లేదని, అందుకే దుష్ప్రచారాలు చేస్తు ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి అంబేద్కర్ రాజ్యాంగానికి కట్టుబడి పని చేస్తుందని, అందరికీ రిజర్వేషన్ల ఫలాలు అందాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. అగ్రవర్ణాలు , బీసీ, ఎస్టీ , ఎస్సీ, మైనారిటీలు బిజెపి కి అండగా ఉన్నారనే అక్కసుతో కాంగ్రెస్ ఆయా వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి కుటిల రాజకీయాలు చేస్తుందని, స్వయంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందులో భాగస్వామ్యం అయినందుకే ఢిల్లీ పోలీసులే నోటీసులు ఇచ్చారన్నారు. ముఖ్యం గా దేశ ప్రధానియే ఒక బీసీ, దేశానికి మొదటిసారి గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసింది, అంబేద్కర్ కి భారత రత్న ఇచ్చి గౌరవించింది బిజెపి నే అన్నారు. బిజెపికి దేశవ్యాప్తంగా ఉన్న ఆదరణ, అన్ని వర్గాల ప్రజల మద్దతు ను కాంగ్రెస్ నేడు జీర్ణించుకోలేకపోతుందని , అందుకే చౌకబారు పనికిమాలిన రాజకీయాలు చేస్తుందని వారు దుయ్యబట్టారు. ప్రధానంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గారెంటీలను అమలు చేయడంలో గోరంగా విఫలమైందని , అందుకే ప్రజల దృష్టిని మరల్చడానికి అవాస్తవమైన రిజర్వేషన్ల రద్దు అంశంతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ కల్పిత అవాస్తవమైన రిజర్వేషన్ల రద్దు అంశాన్ని వైరల్ చేసి, రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తుందని, దీన్ని బిజెపి పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు . రిజర్వేషన్ల అంశంతో కులాల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలను కాంగ్రెస్ మానుకుంటే మంచిదని హెచ్చరించారు. అనంతరం బిజెపి దళిత మోర్చ రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్ రెడ్డి మాట్లాడు తూ దేశవ్యాప్తంగా బిజెపికి ఉన్న ప్రజాదరణ కాంగ్రెస్కు లేదని , అందుకే రిజర్వేషన్ల పేరిట చిల్లరం రాజకీయాన్నిమొదలుపెట్టిందన్నారు. రిజర్వేషన్ లు అందరికీ అందించడానికి కోసం బిజెపి గత పదేళ్లగా ఎంతో కృషి చేసిందన్నారు. అలాంటి రిజర్వేషన్లు ప్రస్తుతం కళ్ళముందు కనబడుతున్నాయన్నారు. రిజర్వేషన్లు బిజెపి రద్దు చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించడం అవివేకమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంట నలిని, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురుశెట్టి సంపత్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు యువ క్రాంతి, ఉప్పరపల్లి శ్రీనివాస్, కొడిమ్యాల రవీందర్ రెడ్డి, రమణారెడ్డి , బీజేవైఎం రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి బండారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో సిఎస్కెఐ క్రీడాకారిణికి బంగారు పతకాలు

కరీంనగర్, మే2 (నేటినిజం ప్రతినిధి) ఏప్రిల్ 30వ తేదీన కేరళలోని కాలికట్ లో జరిగిన తకేషి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కరాటే పోటీలలో కాంటినెంటల్ షోటోకాన్ కరాటేడో ఇండియా నేషనల్ అకాడమి సిఎస్కెఐ నుండి జూనియర్ -50 కెజీ విభాగములో కె పావని కటా కుమిటి రెండు బంగారు పతకాలు సాధించినట్లు సిఎస్కెఐ ఇండియా చీఫ్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షిహన్ ఇ శ్రీనివాస్ తెలిపారు. 18 రాష్ట్రాల నుండి నుండి సుమారు 1100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన పావనిని సిఎస్కెఐ ఛైర్మన్, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షులు పెద్ది సందీప్ లు అభినందించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.